J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12



THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

కాంతి

సంపుటి : 46 సంచిక : 23 6.11.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

విపిఆర్ విశ్వాసం | నారాయణ నమ్మకం | శ్రీధర్‌రెడ్డి శ్రమ



80,170 ఓట్ల మెజారిటీతో



రూప్‌కుమార్ మేయరయ్యాడు

నెల్లూరు రాజకీయ చరిత్రలో కూటమి సరికొత్త అధ్యాయం!

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికలు నగర రాజకీయ చరిత్రలో ఒక సంచలన విజయంగా నిలిచాయి. గత ఎన్నికలకు భిన్నంగా, ఈసారి జరిగిన పురపోరులో రాజకీయ సమీకరణలు, నాయకుల వ్యూహాలు, వ్యక్తిగత అనుబంధాలు, అభివృద్ధిపై ప్రజల్లో ఉన్న అంచనాలు కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా ముగ్గురు కీలక నాయకులు పెట్టుకున్న విశ్వాసం, నమ్మకం, చేసిన కృషి కూటమి విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నగర ప్రజలపై ఉంచిన విశ్వాసం, నగర శాసనసభ్యుడు, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధిపై పెట్టుకున్న నమ్మకం, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ విజయం కోసం, తన చిరకాల మిత్రుడు రూప్‌కుమార్ యాదవ్‌ను మేయర్‌గా చూడాలన్న సంకల్పంతో చేసిన శ్రమ.. ఈ మూడు అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా నగరం, రూరల్ ప్రాంతాల ఓటర్లు కూటమికి అనుకూలంగా ఏకపక్ష తీర్పు నిచ్చారు. పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ *80,170* ఓట్ల భారీ మెజారిటీతో మేయర్‌గా ఎన్నికయ్యారు.

11లో

స్థానిక పోరు తొలి అంకంలో


పురం కూటమి పరం



- కూటమి కాంబినేషన్ బంపర్ హిట్
- క్షేత్రస్థాయిలోనూ ఒక్కటిగా సాగిన కార్యకర్తలు
- పురపోరులో కూటమి సునామీకి ప్రధాన కారణమిదే
- చిత్తయిన ఫ్యాన్ పార్టీ, అయోమయంలో కేడర్

మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. కూటమి పార్టీల మధ్య సర్దుబాట్లు కుదరలేదన్నారు. మూడు పార్టీల కేడర్ మధ్య సమన్వయమే లేదన్నారు. సంక్షేమం సక్రమంగా చేయడం లేదన్నారు. మొత్తంగా పురపోరులో ప్రభుత్వానికి పెద్దదెబ్బ తప్పదన్నారు. సరిగ్గా వారం తిరగకుండానే, ప్రత్యర్థుల బాక్స్ బద్ధలైంది. క్షేత్రస్థాయిలో సీన్ రివర్సయ్యింది. విమర్శించిన నోళ్లు మూతబడ్డాయి. ఒక్క గెలుపు భవిష్యత్ ఆంధ్రా రాజకీయ ముఖచిత్రాన్ని తేటతెల్లం చేసింది. కూటమికి ఇప్పట్లో ఎదురే లేదని తేల్చేసింది.

2లో





కాకాణి నాయకత్వంలో..చతికిలబడ్డ వైసీపీ!

● మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎద్దేవా

జిల్లాలో ఇటీవల జరిగిన కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయధంకా మోగించిందని, కాకాణి నాయకత్వంలో వైసీపీ చతికిలబడిపోయిందని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి చెప్పారు. టీడీపీ విజయం సాధించేందుకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు అందరూ సమిష్టిగా కృషిచేశారని ఆయన అన్నారు. నెల్లూరు మేయర్ అభ్యర్థిగా, ఓసీ స్థానంలో బీసీ అభ్యర్థి రూప్‌కుమార్ ఘన విజయం సాధించడం, రిజర్వేషన్లను అడ్డుకున్న జగన్ రెడ్డికి చెంపదెబ్బేనన్నారు. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీల్లోనూ ఘన విజయంతో నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేసిందన్నారు. అదేవిధంగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలవబోతున్నామని ఆయన జోస్యం చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి మరోసారి సత్తా చాటిందని, పులివెందుల, కడపలో ఓటమితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి క్లీన్‌స్వీప్‌తో జగన్‌రెడ్డికి దిమ్మతిరిగి నట్టయిందన్నారు.

నెల్లూరులో మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, బుచ్చి ఛైర్‌పర్సన్‌గా గెలిచిన దొడ్ల విజయలక్ష్మి, ఆత్మకూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా విజయం కైవసం చేసుకున్న డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా రెడ్డిలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజామోదానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో తమ ఆత్మీయులు అనేకమంది కార్పొరేటర్లుగా ఘనవిజయం సాధించడం సంతోషకరమన్నారు. నిన్నటివరకు తామే తోపులు, తురుములంటూ నోరు పారేసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి ఈ ఫలితాలతో ఇక మూలన కూర్చోవాల్సిందేనని ఆయన ఎద్దేవా చేశారు.

పురం కూటమి పరం

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీది సూపర్‌హిట్ కాంబినేషన్ అని మరోసారి రుజువైంది. తద్వారా నగరాలు, పట్టణాలే కాదు, రేపటి పల్లెపోరులోనూ వార్ వన్‌సైడే అని గట్టి సంకేతమిచ్చింది.

2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను కూటమి మరోసారి రిపీట్ చేసింది. ఈవీఎంలలోనే కాదు బ్యాలెట్ పోరులోనూ తమకు ఎదురేలేదని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీలు నిరూపించాయి. పార్టీల అధ్యక్షులు, అగ్రనేతల మధ్యే కాదు కార్యకర్తల స్థాయిలోనూ తామంతా ఒక్కటే అని మూడు పార్టీల కేడర్ ప్రపంచానికి చాటి చెప్పింది. తద్వారా స్థానిక పోరులో మొదటి అంకమైన మున్సిపాలిటీల్లో ఘన విజయం సాధించింది. పెద్దపులి తరహాలో ప్రళయబీకరంగా గాండ్రించి ప్రత్యర్థులను బెంబేలెత్తించింది. కూటమి పార్టీల కార్యకర్తల సమన్వయానికి పుర ఓటర్లు పట్టణాభిషేకం చేశారు. ఏకంగా 95శాతానికి పైగా పురపాలికలను, 98 శాతానికిపైగా నగరపాలక సంస్థలను, 95 శాతానికిపైగా నగర పంచాయతీలను కూటమి పరం చేసి ప్రధాన ప్రత్యర్థి అయిన వైఎస్సార్‌సీపీకి దిమ్మదిరిగి బొమ్మ కనబడేలా చేశారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లోనే కాదు క్షేత్ర స్థాయి పోటీలోనూ కూటమికి అడ్డే లేదని తేల్చేశారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి కలిసి సాగుతుందన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మాధవ్ పిలుపును తూ.చ తప్పక పాటిస్తామన్నట్లుగా కేడర్ కలిసికట్టుగా ముందుకుసాగి కూటమి ప్రత్యర్థి జగన్‌పార్టీని కసిదీరా ఓడించి చిత్తుచేసింది. 2021 స్థానిక ఎన్నికల్లో ఎదురైన పరాభవానికి గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది.

దెబ్బ అదుర్స్..!

ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా రెండున్నరేళ్ల తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ ఏకపక్ష విజయం సాధించడం కూటమి పార్టీల్లో ఎనలేని ఉత్సాహం తీసుకొచ్చింది. రెండున్నరేళ్ల ఎన్డీయే పాలనకు ఇది రెఫరెండంగా ఆయా పార్టీల నాయకులు, విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. ఎందుకంటే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జగన్ ప్రభుత్వం స్థాయిలో సంక్షేమాన్ని అందించలేదని, ప్రజలకు డబ్బు పంపిణీ చేయడం లేదని, తద్వారా ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో అసంతృప్తి ఉందనే ప్రచారం కూడా ఎన్నికలకు ముందు జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు కూటమి పార్టీలకు నల్లేరు మీద బండి నడకలా సాగవని, గట్టి పోటీ తప్పదని పలువురు భావించారు. అదే సమయంలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య సత్సంబంధాలు అంతంత మాత్రమేనని స్థానిక ఎన్నికల్లో ఆ ప్రభావం తప్పక ఉంటుందని, ఫలితాలు తేడా కొట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న విశ్లేషణలు సైతం వినిపించాయి. కానీ రాజకీయాల్లో తలపండిన చంద్రబాబు కూటమి నాయకులు, కార్యకర్తల్లో వచ్చిన అసంతృప్తి, విభేదాలను టీకప్పులో తుపానులా మార్చేసి ఎక్కడికక్కడ కూటమి ధర్మం తప్పకుండా సీట్లు సర్దుబాటు చేశారు. గత ఎన్నికల్లో 12 శాతం సీట్లు పొంది, 100 శాతం స్ట్రైక్ రేట్‌లో విజయం సాధించిన జనసేనకు ఈసారి 14 శాతం వార్డులు, డివిజన్లు కేటాయించి తొలిసారి పురపాలికలు, నగర పాలక సంస్థల్లో జనసేన జెండా ఎగిరేందుకు కారకులయ్యారు. అలాగే భారతీయ జనతాపార్టీకి సంతృప్తికరమైన సీట్లను కేటాయించి వారినీ అక్కున చేర్చుకున్నారు. పైగా జనసేన, బీజేపీకి కొన్ని సీట్లలో నాయకులు కరువైనా తెలుగుదేశం నాయకులే మిత్రపక్ష పార్టీల కండువాలు కప్పుకుని మరీ వారి తరపున విజయబావుటా ఎగురవేశారు. ఇక నామినేషన్లు, స్క్రూటినీ, ప్రచారం, పోలింగ్, కౌంటింగ్ సమయంలో అన్నీ తామే అయ్యి మూడు పార్టీల క్యాడర్‌ని ముందుకు నడిపించి అంగ, అర్థ బలాలను సమకూర్చి కూటమి ఏకపక్ష విజయానికి కారకులయ్యారు.

అప్పుడు వేసిన విత్తనం..
ఇప్పుడు మహా వృక్షమైంది..!

2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి పార్టీల ప్రణాళిక, సమన్వయంతో పాటూ మరో అంశం కూడా ప్రస్తుతం పొలిటికల్ సర్కిల్స్‌లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 71 మున్సిపాలిటీల్లో 70 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. అలాగే 12 కార్పొరేషన్లకు గాను పన్నెండింటినీ జగన్ పార్టీనే దక్కించుకుంది. మున్సిపాలిటీల్లో ఒక్క తాడిపత్రిలో మాత్రమే తెలుగుదేశం జెండా ఎగిరింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన దాడులు, విధ్వంసాలు అప్పట్లో పత్రికల్లో పతాకశీర్షికలయ్యాయి. డబ్బు పంపిణీ, బెదిరింపులు పెద్దఎత్తున చర్చనీయాంశమయ్యాయి. ఈ క్రమంలోనే అప్పట్లో 4 మున్సిపాలిటీలను ఫ్యాన్‌పార్టీ ఏకగ్రీవం చేసుకుంది. వైఎస్సార్‌సీపీ దాడుల నుంచి పార్టీ కేడర్‌ను రక్షించుకునేందుకే అన్నట్లుగా తెలుగుదేశం పార్టీ ఏకంగా స్థానిక సంస్థల ఎన్నికలను అధికారికంగానే బహిష్కరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అవమానాలు, ఈ కసే ప్రస్తుతం మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 17 చోట్ల కూటమి పార్టీలకు ఏకగ్రీవం కావడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ అవమానాలు, కసే కూటమి నాయకులను ఎన్ని విభేదాలు వచ్చినా విడిపోనీయకుండా కలిసికట్టుగా ముందుకు నడిపిస్తోంది. తద్వారా 2024 ఎన్నికల్లో చూపిన సమన్వయాన్నే మరోసారి పునరావృతం చేసిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పట్లో జగన్ పార్టీలోని కోటరీ నాయకులు, బడా నేతలు ఇష్టారాజ్యంగా యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ఎన్నికలను ఏకపక్షం చేసుకోవడమే కాకుండా ఏకంగా చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలోనూ ఆయన్ని తిరగనీయకుండా అడ్డుకున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భరత్, మిథున్‌రెడ్డి వంటి వారు చంద్రబాబును కించపరుస్తూ హేళన కూడా చేశారు. తిరుపతి వంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లోనూ యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడి అన్ని వార్డులనూ వైఎస్సార్‌సీపీ దక్కించుకోవడం టీడీపీ కేడర్ అహాన్ని దెబ్బతీసింది. ఈ కసే ప్రస్తుతం 87 మున్సిపాలిటీల్లో మూడు మినహా 84 కూటమి ఖాతాలో చేరడానికి, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో ఏకంగా 12 చేజిక్కించుకోవడానికి ముఖ్య కారణంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో అధికార అహంతో వైఎస్సార్‌సీపీ నాటిన అప్రజాస్వామిక విత్తనం నేడు మహావృక్షమై వైఎస్సార్‌సీపీ ఘోర ఓటమికి కర్త.. కర్మ.. క్రియ అయ్యిందని వ్యాఖ్యానిస్తున్నారు.

జగన్‌కోట.. కకావికలం..!

పులివెందుల వైఎస్ ఫ్యామిలీకి దశాబ్దాలుగా పెట్టని కోట. కడప జిల్లా వైఎస్సార్ కుటుంబానికి నిత్యం అండగా నిలిచే రాజకీయ ఖిల్లా. ఇక్కడ ప్రత్యర్థులు కనీసం నామినేషన్లు వెయ్యాలన్నా ఒకటికి వెయ్యి సార్లు ఆలోచించేవారు. అలాంటి చోట్ల ప్రస్తుతం సైకిల్ ప్రభంజనం సృష్టించింది. అగ్నికి వాయువు తోడైనట్లు టీడీపీకి జనసేన, భారతీయ జనతాపార్టీ తోడు కావడంతో కడప కార్పొరేషన్‌తో పాటు పులివెందుల, పొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్, జమ్మలమడుగు, కమలాపురం, రాజంపేట, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలు కూటమి ఖాతాలో చేరిపోయాయి. వైఎస్సార్ సీపీ రాయలసీమ పరిధిలోని బేతంచెర్ల నగర పంచాయితీతో పాటు నందికొట్కూరు, నాయుడుపేట మున్సిపాలిటీలను గెలిచినా, కడప జిల్లాలో మాత్రం ఒక్క చోట కూడా ప్రభావం చూపకపోవడం జగన్ కోటకు బీటలు ఏర్పడ్డాయనడానికి స్పష్టమైన సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా గతంలో జగన్ కడప జిల్లాకు వస్తున్నారంటే కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు పెద్దఎత్తున ఆయనకి స్వాగతం పలకడమే కాకుండా సమస్యలను విన్నవించుకునేందుకు తండోప తండాలుగా వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుండడం వైఎస్సార్ కేడర్‌లో కలకలం రేపుతోందడనంలో సందేహం లేదు. దీనికి తోడు తామొస్తే, రప్పా....రప్పా అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వైఎస్సార్‌సీపీ నాయకత్వం తరచూ ప్రకటనలు చేయడం కూడా ప్రజల్లో తప్పుడు సంకేతాలకు కారణమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉడత సాయమైనా గొప్పే అనుకోవాలని, ఎంత బలహీనమైన మిత్రుడినైనా దగ్గరకు తీసుకోవాలని చాణక్యుడు తన అర్థశాస్త్రంలో రాజకీయనాయకులకు గీతోపదేశం చేశాడు. అయితే ఇలాంటి సూక్తులను పట్టించుకోని జగన్ అండ్ కో వామపక్షాలు, కాంగ్రెస్ వంటి పార్టీలతో సమన్వయం చేసుకోకుండా ఎప్పుడూ సింహం సింగిల్ అంటూ బీరాలు పోతూ ఒంటరి పోరుకే సై అనడం కూడా ఆ పార్టీ కొంప ముంచుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇక జగన్ చుట్టపు చూపుగా బెంగళూరు నుంచి రాష్ట్రానికి రావడం ఓ ప్రెస్‌మీట్ పెట్టి వెళ్లిపోవడం కూడా పార్టీ ఎదగలేక పోవడానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వైఎస్సార్‌సీపీ భవిష్యత్‌పై నీలినీడలు తప్పక పోవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. అధినేత మారే వరకు తమ పార్టీ గీత, కార్యకర్తల రాత మారబోదని పేరు చెప్పుకోలేని కొందరు వైఎస్సార్‌సీపీ కీలక నాయకులు వాపోతుండడం ఆపార్టీ దుస్థితిని కళ్లకు కడుతోంది.

పల్లె.. పరిషత్ పోరులోనూ ఇదే బాట!

మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం, వైఎస్సార్‌సీపీ చతికిల పడడంతో ప్రస్తుతం అందరి దృష్టి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై పడింది. ఇప్పటికీ మెజారిటీ స్థానాలు ఏకగ్రీవం కాగా మిగిలిన స్థానాల్లోనూ కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభంజనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక చివరి విడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమికి అఖండ విజయం దక్కబోతోందని విశ్లేషకులు జోస్యం చెబుతున్నారు. ఏదేమైనా మున్సిపల్ ఎన్నికల్లో పురాలన్నీ కూటమి పరమై ఆ మూడు పార్టీలకి దక్కిన భారీ విజయం కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం తీసుకొచ్చింది. మూడు పార్టీల నాయకులకి తమ పార్టీల భవిష్యత్‌పై ఈ అఖండ విజయం భరోసా కలిగించిందని చెప్పడంలో సందేహం లేదు!

సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు

● కాపాడిన జిల్లా అధికారులు



నెల్లూరుజిల్లా కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె సమీపంలోని సముద్రంలో ఇటీవల చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను జిల్లా అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో అప్రమత్తంగా చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో మార్గమధ్యంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్‌పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో నిలిచిపోయారని, ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వేలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారని, దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో వారిని రక్షించారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వేలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

గల్లంతైన మరో ఐదుగురు క్షేమం

అదేవిధంగా చీరాల మండలం ఓడూరు గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతు కాగా, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాల మేరకు మెరైన్ పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో చేపట్టిన గాలింపు చర్యల ద్వారా వారందరినీ సురక్షితంగా రక్షించారు. ఆనంతరం కృష్ణపట్నం పోర్టుకు తీసుకువచ్చి, మెరైన్ డీఎస్పీ పర్యవేక్షణలో, రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పోర్టులోని సీవీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారి స్వస్థలాలకు సురక్షితంగా పంపించారు.


'షార్ వాణి' కవితల పోటీలో..
ఇంద్రగంటికి ప్రథమ బహుమతి



శ్రీహరికోటలోని "షార్ వాణి" పత్రిక వారు ఇటీవల నిర్వహించిన సివిఎస్ మహేష్ స్మారక కవితల పోటీలలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి ఇంద్రగంటి మధుసూదన రావు రచించిన కవితకు ప్రథమ బహుమతి లభించింది. గత 40 సంవత్సరాలుగా ఆయన వచన కవితలు, పద్యాలు, పేరడీలు, నానీలు, కథలు రాస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు, బహుమతులు అందుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నారు కూడా. ఇంద్రగంటి కవితకి ప్రథమ బహుమతి రావడం పట్ల ఆయన సహచరులు, సాహిత్యాభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మన కలెక్టర్ తీరే వేరు!

నిబద్ధతకు ఆయన మారుపేరు



మన కలెక్టర్ తీరే వేరు. నిబద్ధతకు ఆయన మారుపేరు. పనితీరులో ఆయనకెవరూ సాటిలేరు. ప్రజలకి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆయన అందరు అధికారుల్లా కాక, ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తారు. అందరికీ ఆయన ఆదర్శంగా నిలుస్తారు. అందుకే నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అంటే అటు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికే కాక, జిల్లా ప్రజలకి కూడా అభిమానం. ఆయన పనితీరులోని ప్రత్యేకతకి ముఖ్యమంత్రి పలుసార్లు అభినందించారు కూడా.

మొన్నటికి మొన్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కూడా ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఒకవైపు వానలు, మరోవైపు ఎన్నికలు, ఎన్నెన్నో పనులతో అనుక్షణం సతమవుతుండే కలెక్టర్, నవంబరు 1న నెల్లూరు నగరంలోని పలు పోలింగ్‌కేంద్రాలను వెంట వెంటనే పరిశీలించేందుకు స్వయంగా మోటార్‌బైక్ ఎక్కారు. తానే దానిని నడుపుతూ వెళ్ళడం విశేషం. బైక్‌పై సిబ్బంది ఒకరిని కూర్చోబెట్టుకుని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓట్ల పోలింగ్‌ను ఆయన పరిశీలించారు. మూలాపేట డిఎస్ఆర్ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్ళి పోలింగ్ తీరును పరిశీలించారు. మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సజావుగా జరిగేందుకు, ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటువేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి మరోసారి వివరించి తగు సూచనలిచ్చారు. పోలింగ్ కేంద్రాలకి కలెక్టర్ స్వయంగా బైక్‌పై రావడంతో అక్కడున్న అధికారులు, ఓటర్లు ఆశ్చర్యపోయారు. 'కలెక్టర్ అంటే ఇలా ఉండాలి' అంటూ కలెక్టర్ హిమాన్షు పనితీరును చూసి అందరూ మెచ్చుకున్నారు.

బాలిక చదువుకు భరోసా

నెల్లూరుజిల్లా కొండాపురంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక ప్రస్తుతం హైదరాబాద్‌లో తండ్రి వద్ద ఉంటోంది. తనకు చదువుకోవాలని ఉందంటూ ఆ బాలిక ఇటీవల విద్యామంత్రి లోకేష్‌కి ట్విట్టర్‌లో తెలియజేయడంతో ఆయన అందుకు స్పందించి బాలిక చదువుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఆ బాలిక తండ్రి వద్దకు ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపి కౌన్సిలింగ్ ఇచ్చి, బాలికను కొండాపురం పాఠశాలలో చదివేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బాలికల విద్యకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న వీపీఆర్, రూప్‌కుమార్



నవంబర్ 5వ తేదీ గురువారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న నెల్లూరు నగర మేయర్ రూప్‌కుమార్. కార్పొరేటర్ కువ్వారపు బాలాజీ, టీడీపీ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, కలికి శ్రీధర్‌రెడ్డి, నిశ్చల్‌కుమార్‌రెడ్డి, అచ్చాల శ్రీనివాసులురెడ్డి, అల్లంపాటి జనార్దన్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో వున్నారు.

ఆత్మకూరు అభివృద్ధే..

అందరి లక్ష్యం కావాలి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




ఆత్మకూరులో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో, ఇకనుంచీ అందరూ కలసికట్టుగా ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 4న ఆయన ఆత్మకూరులో ఎన్డీఏ కూటమి విజయం సందర్భంగా ఈనెల 4న ఆయన నాయకులతో, విజేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత, పురపాలక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించిన ఆత్మకూరు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎన్డీఏ కూటమిపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమన్నారు. ఆత్మకూరు అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పురపాలక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదేవిధంగా కూటమి విజయానికి అందరూ పాటు పడాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

డబ్బు, అధికారం, బెదిరింపులతోనే కూటమి గెలుపు

- వైసీపీ నాయకుడు..ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ధ్వజం



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో డబ్బు, అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడి కూటమి గెలిచిందని, అధికారపార్టీ తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకునేందుకు అనేక కుతంత్రాలకు దిగారని ఆయన ఆరోపించారు. నెల్లూరు సిటీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 4న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కానీ అభ్యర్థులకు పోటీచేసే అవకాశమే లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎన్ని బెదిరింపులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాడిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కోరారు.



లాయర్
నవంబర్ 06, 2026

వరుస తుఫాన్లతో.. ఎడతెగని కష్టాలు!

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు వరుస తుఫాన్లతో అల్లాడుతోంది. పదిరోజుల వ్యవధిలోనే ఆర్నబ్, మురసు తుఫాన్లు రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు ఈ తుఫాన్ల ధాటికి వణికిపోయాయి. ఆర్నబ్ తుఫాన్ ప్రజలను బెంబేలెత్తిస్తే, మురసు తుఫాన్ మరింతగా భీభత్సం సృష్టించేసింది. ఇవి చాలవన్నట్లు మరికొద్ది రోజుల్లోనే మరో తుఫాన్ కూడా వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్నబ్ తుఫాన్ నష్టాల నుంచి తేరుకుంటున్న దశలో మురసు ముంచెత్తి ప్రజలను గోడుగోడుమనిపించింది. దీని ధాటికి ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీఎత్తున ఈదురుగాలులు వీచాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలో తుఫాన్ విధ్వంసంతో ప్రజలు, ముఖ్యంగా పేదలు, రైతులు నానా బాధలు పడ్డారు. అనేకప్రాంతాల్లో పెద్దపెద్ద వృక్షాలు నేలకూలాయి. రోడ్లు తెగిపోయాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. పంటపొలాలు జలమయమై నష్టాల పాలయ్యాయి. వేలాది ఎకరాల్లో వరి, తదితర పంటలు.. ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మురసు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ఎక్కడ చూసినా విరిగిపడిన చెట్లు, కోసుకుపోయిన రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు కనిపించాయి. పొలాలన్నీ నీటిమడుగులయ్యాయి. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కూడా చెదురుమదురు వర్షాలు పడ్డాయి. ప్రభుత్వం, ఆయా జిల్లాల్లోని అధికారయంత్రాంగమంతా తుఫాన్ వల్ల ప్రాణ నష్టాలు, ఆస్తినష్టాలు ఎక్కువగా జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు, కానీ ఈ తుఫాన్ల వల్ల జరిగే నష్టం చిన్నదేమీ కాదు. అకాల వర్షాలతో వేసుకున్న పంటలు, తోటలు దెబ్బతిని రైతులు పడే బాధలు వర్ణనాతీతం. ఎట్టకేలకు మంగళవారం వేకువన ఒంగోలు-కొత్తపట్నం మధ్య మురసు తుఫాన్ తీరం దాటినా, బుధవారం కూడా అక్కడక్కడా కుండపోత వానలు కురిశాయి. సముద్రం అల్ల కల్లోలంగా మారింది. పలుచోట్ల సముద్రంలో వేటకి వెళ్లివున్న జాలరులు గల్లంతు కావడం, అధికారుల ప్రయత్నాలతో వారిని గుర్తించి తిరిగి స్వస్థలాలకి చేర్చడం కూడా జరిగింది. తుఫాను తీవ్రత వల్ల తీరప్రాంతాల ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో ఆశించిన స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవడంతో కొంతమేరకు నష్టాలను నివారించుకోగలిగామనే చెప్పవచ్చు. మొత్తంగా ఈ మురసు తుఫాన్ వల్ల రాష్ట్రంలోని 15 జిల్లాల్లో సుమారు 30వేల హెక్టార్ల పంటలు నష్టమైనట్లు అధికారులు అంచనా వేశారు. విద్యుత్ స్తంభాలు పెద్దసంఖ్యలో పడిపోవడంతో అనేకప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు చీకట్లో అవస్తలు పడ్డారు. తుఫాన్ కష్టాల్లో ఉన్న ఆంధ్రను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం భరోసా ఇవ్వడం బాధితులకు, నష్టపోయిన రైతులకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది. నష్టాలను అంచనావేసేందుకు కేంద్ర బృందాలు కూడా వచ్చాయి. ఏదేమైనా అటు కేంద్ర, ఇటు రాష్ట్రం తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతాంగాన్ని, ప్రజలను ఆదుకునేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మొత్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గురువారం నాడు (ఈనెల 5న) ఈదురు గాలులలతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా అధికారులు చెప్తున్నారు. వాతావరణ ప్రభావంతో విజయనగరం నుంచి తిరుపతి వరకు 20జిల్లాలో వానలు కురుస్తాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల శాఖ బుధవారం రాత్రి తాజాగా హెచ్చరించింది. ఇదిలా ఉంటే, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా, ఆర్నబ్-మురసు తుఫాన్ల నుంచి పూర్తిగా కోలుకోక ముందే, త్వరలోనే మరో తుఫాన్ రావచ్చనే సమాచారం ప్రజలను మరింతగా భయపెడుతోంది. నవంబరు 11 నుంచి 16వ తేదీ మధ్య బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం ఏర్పడే పరిస్థితి కనిపిస్తోందని, అది కాస్తా తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ వారు అంచనా వేస్తున్నారు. కానీ, అది ఏస్థాయిలో ఏర్పడుతుందో, ఎంతవరకు ఏ ప్రాంతాలను ప్రభావితం చేస్తుందో పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదు. కానీ, ఎందుకైనా మంచిదని, ఆ వస్తుందని భావించే మూడో తుఫాన్ వల్ల నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలతో పాటు దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఏదేమైనా, ఈ వరుస తుఫాన్లతో, ఎల్‌నినో వల్ల కలిగే అనూహ్య వాతావరణ మార్పులతో ఆంధ్ర ప్రజానీకం నానా ఆవస్తలు పడుతోంది. ఇలాంటి విపత్తుల నుంచి బయటపడేందుకు ప్రభుత్వాలు, అధికారులతో పాటు, ఆయా ప్రాంతాల ప్రజలు కూడా ఎంతో అప్రమత్తంగా ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీటీడీ చైర్మన్‌గా మేధావులు, ధార్మిక అవగాహన ఉన్నవారినే నియమించాలి!


తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి పదవీకాలం అక్టోబర్31తో ముగియడంతో, తదుపరి చైర్మెన్ నియామకంపై చర్చ ప్రారంభమైంది. ఇప్పటి వరకు చైర్మన్‌గా కొనసాగిన బి.ఆర్. నాయుడు పదవి నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి చైర్మన్ ఎంపికలో ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

టీటీడీ అనేది కేవలం ఒక పరిపాలనా సంస్థ కాదు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి పవిత్ర క్షేత్రానికి సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మక ధార్మిక సంస్థ. అలాంటి సంస్థకు అధ్యక్షుడిగా నియమితులయ్యే వ్యక్తికి భక్తి భావనతో పాటు ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై సమగ్ర అవగాహన, పరిపాలనా దక్షత, భక్తుల పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం తప్పనిసరిగా ఉండాలి. గత రెండేళ్లలో బి.ఆర్.నాయుడు నేతృత్వంలోని టీటీడీ పాలనపై అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా స్వామివారి దర్శనాల విషయంలో భక్తులకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించలేదనే అసంతృప్తి బలంగా వినిపించింది. సామాన్య భక్తులను ఎక్కువగా లఘు దర్శనాలకే పరిమితం చేయడం, కోట్లాది రూపాయలు విరాళాలుగా అందించే దాతల దర్శన సౌకర్యాల్లోనూ కోతలు విధించడం, కొత్తగా విరాళాలు అందించే దాతలకు కల్పించే సదుపాయాలను తగ్గించడం వంటి నిర్ణయాలు తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. తిరుమలలో వసతి, ప్రసాదాలు, రవాణా వంటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమే. అయితే, భక్తులు తిరుమలకు వచ్చేది ప్రధానంగా స్వామివారి దర్శనం కోసమే అన్న మౌలిక విషయాన్ని పాలకులు విస్మరించకూడదు. దర్శన వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరంగా తీర్చిదిద్దడంతో పాటు బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలోనూ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. ఈ అంశాల్లో ఆశించిన ఫలితాలు కనిపించకపోవడం బిఆర్ నాయుడి పాలనపై ప్రశ్నలు తలెత్తడానికి కారణమైంది. టీటీడీ వంటి పవిత్ర ధార్మిక సంస్థల పాలనను కేవలం రాజకీయ పదవుల పంపిణీగా చూడటం ఎంత మాత్రం సమంజసం కాదు. అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించిన మీడియా ప్రతినిధులకో, ఆర్థికంగా అండగా నిలిచిన పారిశ్రామికవేత్తలకో, రాజకీయంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న రాజకీయ నిరుద్యోగులకో టీటీడీ చైర్మన్ పదవిని కట్టబెట్టడం సరైన సంప్రదాయం కాదు. మన సమాజంలో ఆధ్యాత్మిక, ధార్మిక రంగాలపై అపారమైన అవగాహన కలిగిన మేధావులు, నిష్పక్షపాతంగా వ్యవహరించే పరిపాలనా నిపుణులు, భక్తుల సంక్షేమం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి అర్హతలు, అనుభవం, సేవాభావం కలిగిన వ్యక్తులను గుర్తించి టీటీడీ చైర్మన్‌గా నియమించాలి. కొత్తగా బాధ్యతలు చేపట్టే పాలకమండలి సామాన్య భక్తుల దర్శనానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. దాతల గౌరవాన్ని కాపాడుతూ, దర్శన వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలి. బ్లాక్‌మార్కెట్‌ను పూర్తిగా అరికట్టాలి. తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడాలి. టీటీడీ చైర్మెన్ పదవి రాజకీయ పునరావాస కేంద్రం కాకూడదు. అది కోట్లాదిమంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలవాలి. కాబట్టి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, భక్తి భావన, ధార్మిక పరిజ్ఞానం, పరిపాలనా సామర్థ్యం, నిస్వార్థ సేవాభావం కలిగిన మేధావిని తదుపరి టీటీడీ చైర్మన్‌గా నియమించాలని భక్తుల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను.

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ట్రంప్‌కి మధ్యంతర ఎన్నికల షాక్..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి 2026 మధ్యంతర ఎన్నికలు గట్టి ఎదురుదెబ్బ కొట్టాయి. ప్రతినిధుల సభతోపాటు సెనేట్‌లోనూ డెమొక్రాట్లు ఆధిక్యం సాధించడం రిపబ్లికన్లకు రాజకీయంగా పెద్ద దెబ్బ. రిపబ్లికన్లకు పట్టున్న రాష్ట్రాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు సాధించడం ట్రంప్ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి అద్దం పడుతోంది.

ఈ ఎన్నికల ఫలితాలను కేవలం అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన సాధారణ తీర్పుగా మాత్రమే చూడలేం. ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ, ఆర్థిక, వలస విధానాలపై అమెరికా ప్రజలు వ్యక్తంచేసిన అసమ్మతిగా భావించాలి. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఇరాన్‌తో యుద్ధం అమెరికా అంతర్గత రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపింది. ప్రపంచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పే శాంతిదూతగా తనను తాను అభివర్ణించుకునే ట్రంప్ మరోవైపు యుద్ధాన్ని తీవ్రతరం చేయడం ప్రజల్లో వ్యతిరేకతను పెంచింది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడటం, ఇంధన ధరలు పెరగడం అమెరికా ప్రజలపై నేరుగా ప్రభావం చూపాయి. పెట్రోల్ ధరల పెరుగుదల రవాణా వ్యయాలను పెంచితే, ఆ భారం ఆహార పదార్థాలు సహా నిత్యావసర వస్తువుల ధరలపైనా పడింది. మరోవైపు ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలు, వాణిజ్య ఆంక్షలు దేశీయ మార్కెట్లోకి వచ్చే వస్తువుల ధరలను పెంచాయి. అమెరికా ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తానన్న ట్రంప్ హామీకి ఇది విరుద్ధంగా ఉంది. ఎన్నికల అనంతరం అసోసియేటెడ్ ప్రెస్ నిర్వహించిన ఓటరు సర్వే ప్రకారం, దాదాపు సగం మంది ఓటర్లు జీవన వ్యయం, ప్రభుత్వ అవినీతి తాము ఓటు వేసే విషయంలో కీలకమని పేర్కొన్నారు. సుమారు 10 మందిలో ఆరుగురు ట్రంప్ పాలన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇక వలసల విషయంలో ట్రంప్ అనుసరించిన కఠిన వైఖరి కూడా ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లకు ప్రతికూలంగా మారింది. అక్రమ వలసలను అరికట్టడం పేరుతో చేపట్టిన చర్యలు, వలసదారుల పట్ల అనుసరించిన దూకుడు ధోరణి, వారి పట్ల వివక్షాపూరిత వ్యాఖ్యలు అమెరికా సమాజంలో విభజనను మరింత పెంచాయి. వలసదారుల కృషితోనే ఆర్థికంగా ఎదిగిన దేశంలో వారిని లక్ష్యంగా చేసుకునే రాజకీయాలు అందరినీ ఆకట్టుకోలేవని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. యువ ఓటర్లు కూడా గణనీయంగా డెమొక్రాట్ల వైపు మొగ్గుచూపారు.

ఈ ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళన. అధ్యక్షుడి నిర్ణయాలను ప్రశ్నించే, ఆయన అధికారాలకు రాజ్యాంగబద్ధమైన నియంత్రణలు విధించే బాధ్యత కాంగ్రెస్‌దే. అయితే ట్రంప్ పాలనలో కాంగ్రెస్ ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదన్న అభిప్రాయం ఓటర్లలో బలపడింది. ఎన్నికల అనంతరం వెలువడిన ఏపీ ఓటరు సర్వేలో దాదాపు 70 శాతం మంది అధ్యక్షుడి అధికారాలపై నియంత్రణలు విధించేందుకు కాంగ్రెస్ మరింత చురుగ్గా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. అంటే ఈ ఎన్నికల్లో ప్రజలు కేవలం ధరల పెరుగుదలపైనే కాకుండా అధికార కేంద్రీకరణపైనా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రిపబ్లికన్లకు బలమైన పట్టున్న కాన్సాస్, అయోవా, టెక్సాస్, ఒహాయో, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా వంటి రాష్ట్రాల్లో డెమొక్రాట్లు సెనేట్ స్థానాలను గెలుచుకోవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పరిణామం. ప్రతినిధుల సభలోనూ, ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన అనేక నియోజకవర్గాల్లో డెమొక్రాట్లు విజయం సాధించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతిచ్చిన కొన్ని వర్గాలు రెండేళ్లకే ఆయనకు దూరమవుతున్నాయనడానికి ఇది నిదర్శనం. ఈ పరిణామాలు 2028 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్లకు గట్టి సవాలు కావచ్చనే సంకేతాలిస్తున్నాయి.

భారత సంతతికి చెందిన అభ్యర్థుల విజయాలు, పరాజయాలు కూడా ఈ ఎన్నికల్లో ఆసక్తికరంగా నిలిచాయి. డెమొక్రటిక్ అభ్యర్థి పియా దాండియా ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ నియోజకవర్గం నుంచి సుహాస్ సుబ్రహ్మణ్యం మరోసారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ కూడా మరోసారి విజయం సాధించారు. మరోవైపు రిపబ్లికన్ అభ్యర్థి వివేక్ రామస్వామి ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో పరాజయం పాలయ్యారు. రో ఖన్నా, అమీ బేరా, ప్రమీలా జయపాల్, అమిష్ షా వంటి ఇతర భారత సంతతి డెమొక్రటిక్ అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గాల్లో ముందంజలో ఉన్నట్లు నవంబర్ 4వ తేదీ ఉదయం వెలువడిన నివేదికలు వెల్లడించాయి. అమెరికా రాజకీయాల్లో భారత సంతతి వ్యక్తుల ప్రాతినిధ్యం పెరుగుతుండటం ఆసక్తికరమైన పరిణామం.

ఇక ఈ ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్ ముందున్న అసలు సవాలు పశ్చిమాసియా యుద్ధం విషయంలోనే. ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన ఆయన యుద్ధ వైఖరిలో మార్పు వస్తుందని చెప్పలేం. పైగా తన విధానాలను సమర్థించుకుంటూ, ఓటమికి తన పాలనను కారణంగా అంగీకరించకుండా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఆయనలో పెద్దగా పశ్చాత్తాపం కనిపించడం లేదని అర్థమవుతోంది.

కాంగ్రెస్‌లో డెమొక్రాట్లకు ఆధిక్యం రావడంవల్ల యుద్ధానికి అవసరమైన నిధుల కేటాయింపు, సైనిక వ్యయాలు, విదేశాంగ విధానాల విషయంలో ట్రంప్‌కి అడ్డంకులు ఎదురుకావచ్చు. అంతేకాదు, యుద్ధంపై విచారణలు, చర్చలు చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే అవకాశం కూడా డెమొక్రాట్లకు ఉంటుంది. డెమొక్రాట్ల ఆధిక్యం ట్రంప్ యుద్ధ విధానాలకు అడ్డుకట్ట వేయగలదా? లేక ఆయన మరోసారి సైనిక చర్యలకు దిగుతారా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. ట్రంప్ పాలనకు మరో రెండేళ్ల సమయం ఉంది. 2028 అధ్యక్ష ఎన్నికలకు ఈ మధ్యంతర ఫలితాలు ఒక ముందస్తు సంకేతం మాత్రమే. అది నిజమైన రాజకీయ మార్పుగా రూపాంతరం చెందుతుందా లేదా అన్నది రాబోయే రెండేళ్ల పరిణామాలే నిర్ణయిస్తాయి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

నెల్లూరు నగర కార్పొరేషన్ కొత్త కార్పొరేటర్లు వీరే...



డివిజన్:1
కుడుముల చిరంజీవి
టీడీపీ



డివిజన్:2
మహమ్మద్ జావీద్
టీడీపీ



డివిజన్:3
మేకల మధుపావని
టీడీపీ



డివిజన్:4
మనికల నాగమణి
టీడీపీ



డివిజన్:5
ఇంగిలేల అబ్రహం
టీడీపీ



డివిజన్:6
బత్తల శ్రీకాంత్
జనసేన



డివిజన్:7
సిరిగిరి లక్ష్మి
బీజేపీ



డివిజన్:8
మామిడాల మధు
టీడీపీ



డివిజన్:9
తాలూరి శశికుమార్
టీడీపీ



డివిజన్:10
కిన్నెర కోటేశ్వరి
టీడీపీ



డివిజన్:11
కొండా గీతిక
టీడీపీ



డివిజన్:12
కిన్నెర సాగర్
టీడీపీ



డివిజన్:13
నెల్వాయి కామాక్షి
వైయస్సార్సీపీ



డివిజన్:14
కువ్వరపు బాలాజి
టీడీపీ



డివిజన్:15
జి.కెజియాకుమారి
జనసేన



డివిజన్:16
కమ్మ కళ్యాణి
టీడీపీ



డివిజన్:17
కాకర్ల తిరుమలనాయుడు
టీడీపీ



డివిజన్:18
గొడ్డేటి లక్ష్మి
టీడీపీ



డివిజన్:19
కర్తం ప్రతాప్‌రెడ్డి
టీడీపీ



డివిజన్:20
గణేశం వెంకటేశ్వర్లు
టీడీపీ



డివిజన్:21
గునుకుల విజయలక్ష్మి
జనసేన



డివిజన్:22
ఉచ్చి భువనేశ్వరిప్రసాద్
టీడీపీ



డివిజన్:23
కాయల తిరుపతి
టీడీపీ



డివిజన్:24
ఊటుకూరు చందుప్రియ
టీడీపీ



డివిజన్:25
దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి
టీడీపీ



డివిజన్:26
సున్నా గాయత్రి
టీడీపీ



డివిజన్:27
నూకరాజ మదన్‌కుమార్‌రెడ్డి
టీడీపీ



డివిజన్:28
నన్నం శ్రీనివాసులు
టీడీపీ



డివిజన్:29
నాగిశెట్టి మురళీకృష్ణ
జనసేన



డివిజన్:30
నూనె రుషికేష్‌యాదవ్
జనసేన



డివిజన్:31
యరబోలు రాజేష్
బీజేపీ



డివిజన్:32
మేకల మధు
టీడీపీ



డివిజన్:33
అరవ శాంతి
టీడీపీ



డివిజన్:34
బి.చాముండేశ్వరి
టీడీపీ



డివిజన్:35
డి.శ్రీనివాసులురెడ్డి
టీడీపీ



డివిజన్:36
బుద్దా సుప్రజ
టీడీపీ



డివిజన్:37
షేక్ అబ్దుల్ రసూల్
టీడీపీ



డివిజన్:38
మన్నేపల్లి నీలిమ
టీడీపీ



డివిజన్:39
అత్తివరపు మల్లీశ్వరి
టీడీపీ



డివిజన్:40
ఆర్.అభిషేక్
టీడీపీ

డివిజన్:41
పల్వాటి అపర్ణ
టీడీపీ

డివిజన్:42
మండ్లక్ష్మి కామాక్షి
బీజేపీ

డివిజన్:43
మొగరాల శోభ
బీజేపీ

డివిజన్:44
భమినేని వేదశ్రీ
టీడీపీ

డివిజన్:45
సిహెచ్. సుందరరామిరెడ్డి
జనసేన

డివిజన్:46
షేక్ షంషుద్దీన్
టీడీపీ

డివిజన్:47
తాళ్ళూరు అవినాష్
టీడీపీ

డివిజన్:48
షేక్ హజబున్నీసా
ఇండిపెండెంట్

డివిజన్:49
బి.బర్నాబాస్
టీడీపీ

డివిజన్:50
నందిపాటి శైలజ
టీడీపీ

డివిజన్:51
బెజవాడ భువనేశ్వరి
టీడీపీ

డివిజన్:52
పున్నపు విష్ణుప్రియ
టీడీపీ

డివిజన్:53
కొప్పోలు నవ్యలక్ష్మి
జనసేన

డివిజన్:54
అన్నంగి సమత
టీడీపీ

డివిజన్:55
గండవరం విశాలాక్షి
టీడీపీ

డివిజన్:56
ఎన్.వెంకట శ్రీదివ్య
టీడీపీ

డివిజన్:57
షేక్ షబానాబేగం
టీడీపీ

డివిజన్:58
షేక్ కరిముల్లా
టీడీపీ

డివిజన్:59
దరిసి హరికృష్ణ
టీడీపీ

డివిజన్:60
రఘునాథరాజు.కే
బీజేపీ

డివిజన్:61
ఆనం రంగమయూర్‌రెడ్డి
టీడీపీ

డివిజన్:62
పాట్లూరి రామకృష్ణ
టీడీపీ

డివిజన్:63
మహ్మద్ జుబైరుద్దీన్
టీడీపీ

డివిజన్:64
షేక్ నజిమ
టీడీపీ

డివిజన్:65
ధర్మవరం గణేష్‌కుమార్
టీడీపీ

డివిజన్:66
కప్పిర రేవతి
టీడీపీ

డివిజన్:67
ప్రసన్నకుమారి.ఎన్
టీడీపీ

డివిజన్:68
ఎం.శిరీష
ఇండిపెండెంట్

డివిజన్:69
షేక్ షహీన
టీడీపీ

డివిజన్:70
రాచగిరి చంద్రశేఖర్
టీడీపీ

డివిజన్:71
షేక్ ఆలియా
జనసేన

డివిజన్:72
షేక్ సల్మా
టీడీపీ

నెల్లూరు కబుర్లు

'అమరజీవి' ఆశయాలు..స్ఫూర్తిదాయకం



ఎఎయబీశ్రీంఎయటబీశ్రీన

అచంచలమైన దేశభక్తి, అపారమైన త్యాగనిరతి కలిగిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలు భావితరాలకు మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల చెప్పారు. నవంబరు 1 ఆంధ్రరాష్ట్ర అవతరణం రోజున నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందని, ఆ మహనీయుని ఆత్మత్యాగంతో ప్రత్యేక ఆంధ్ర అవతరణ జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయకుమార్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరజీవిని జ్ఞాపకం చేసుకుంటూ నివాళులర్పించారు.

మాట నిలబెట్టుకున్న షరణి

- మునిసిపల్ స్కూల్ విద్యార్థులకు క్రీడా కిట్‌లు -



క్రీడలను ప్రోత్సహిస్తూ, క్రీడాకారులకు అండగా ఉంటానని మంత్రి నారాయణ తనయ షరణి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నెల్లూరులోని ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారు.. ఏకంగా ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో, మరో 30 మందికిపైగా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపికై నెల్లూరు కీర్తిని దేశవ్యాప్తంగా చాటుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆ విద్యార్థుల కష్టాన్ని, ప్రతిభను గుర్తించి.. గతంలో ఇచ్చిన మాట ప్రకారం షరణి ప్రత్యేకంగా ఈనెల 4న ఆ పాఠశాలకు వెళ్లి వారిని అభినందించారు. మైదానంలోకి వెళ్ళి విద్యార్థులతో కలిసి కోకో, సాఫ్ట్‌బాల్, వాలీబాల్ వంటి ఆటలు ఆడి అందరిలో ఉత్సాహం నింపారు. తండ్రి నారాయణ లాగే తాను కూడా మాట ఇస్తే అది అయ్యేవరకు వదిలేది ఉండదని షరణి నిరూపించారు. ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇప్పుడు క్రీడా విప్లవానికి చిరునామాగా మారిందని, చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా చాటుతూ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో నెల్లూరు పేరును సమున్నతంగా నిలబెడుతున్నారని ఆమె హర్షం వ్యక్తం చేశారు. తన సొంత నిధుల నుంచి జాతీయస్థాయి క్రీడాకారులకు స్పోర్ట్స్ వేర్, షూస్, ట్రాక్ ప్యాంట్లు, కిట్లను ఆమె అందజేసి వారిని ప్రోత్సహించారు.

జైపూర్ సదస్సులో..ఎనెల్ ఆసుపత్రి డాక్టర్ లావణ్య



జ్ఞాపికనందుకుంటున్న డాక్టర్ లావణ్య

జైపూర్‌లో జరుగుతున్న 33వ ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ వార్షిక సదస్సులో నెల్లూరులోని ఎనెల్ ఆసుపత్రి న్యూరాలజీ ఫిజీషియన్ డాక్టర్ కుంకాల లావణ్య పాల్గొన్నారు. దీర్ఘకాలిక నాడీవ్యవస్థకి సంబంధించిన మయాస్తీనియా గ్రేవిస్ వ్యాధికి చేస్తున్న చికిత్సలో సరికొత్త విధానాలు వచ్చాయని ఆమె ఆ సదస్సులో వివరించారు. ప్రస్తుతం వైద్యరంగంలో ఆ వ్యాధికి కార్డ్‌థెరపీ, ప్రొటియోజోమ్ ఇన్‌హిబిటర్ వంటి అనేక మాలిక్యులర్ చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, తల్లి నుంచి గర్భస్థ పిండానికి యాంటీబాడీస్‌ని బదిలీ చేయడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ఆధునిక చికిత్సా విధానాలు నాడీ సంబంధిత రోగులకు మెరుగైన ఫలితాలు అందిస్తున్నాయని ఆమె విశదీకరించారు. అనంతరం సదస్సు నిర్వాహకులు ఆమెను అభినందించి జ్ఞాపికను బహుకరించారు.





నేతలని కలిసి కృతజ్ఞతలు చెప్పిన రూప్





నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 80వేలకిపైగా ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ ఈనెల 4న తన విజయానికి సహకరించిన నేతలను కలుసుకున్నారు. రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణను, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను వారి నివాసంలో గౌరవపూర్వకంగా కలుసుకుని, ఎన్నికల్లో తనకి అన్ని విధాలా అండగా నిలిచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులిద్దరినీ ఆయన సత్కరించారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

'గునుకుల' కృతజ్ఞతలు

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తాను 21వ డివిజిన్ జనసేన అభ్యర్థినిగా నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో నిలిచి గెలిచేందుకు అండగా నిలిచిన నేతలకు జనసేన నాయకురాలు గునుకుల విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను, డివిజన్‌లో తనకు ప్రజాదరణ పెంపొందించడంలో కీలకపాత్ర పోషించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లను ఆమె ఈనెల 4న మర్యాద పూర్వకంగా కలసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందించాలి

క్షయవ్యాధికి సంబంధించిన వ్యాధినిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయాలని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని రాష్ట్ర క్షయ నివారణాధికారి డా. రమేష్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో క్షయవ్యాధి నివారణ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జతీయ క్షయ నివారణ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం పలు ఆరోగ్యకేంద్రాలను ఆయన సందర్శించి, క్షయ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధి రాష్ట్ర డేటా అనలిస్ట్ శ్రీనివాస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ధీరజ్, అరుత్ సెల్వన్, తిరుపతి-నెల్లూరు జిల్లాల క్షయ నివారణ అధికారులు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

-- 'యూత్ పార్లమెంట్'లో వక్తలు --



యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వక్తలు యువతకు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో ఇటీవల 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో జరిగిన "వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027" యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో స్థానిక విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, నారాయణ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులు రెడ్డి, నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రవిప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత కేవలం ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా, నాయకులుగా, నవ్యావిష్కర్తలుగా ఎదగాలన్నారు. పార్లమెంటరీ విధానాలు, చట్టాల తయారీ, సమకాలీన అంశాలపై యువతకు అవగాహన ఉండటం అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తాయని తెలిపారు. జిల్లా యువజన అధికారి బి.శశికాంత్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కార్తీక్, చంద్రమోహన్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యోత్సవాలు



నెల్లూరు పురమందిరంలో ఈనెల 1వ తేదీ రాత్రి జరిగిన శాస్త్రీయ, జానపద నృత్యోత్సవాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి సౌజన్యంతో స్థానిక హరివిల్లు' క్రియేషన్స్ కల్చరల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గురుకృప కళాక్షేత్రం సురభి గాయత్రి, సిద్దేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకుడు డేగా సాంబశివరావు, సాయిలలిత నృత్యనికేతన్ నిర్వాహకురాలు కె. శిరీషాలతో తదితరులు పాల్గొని నృత్యోత్సవాలను పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా అమరావతి కృష్ణారెడ్డి, విద్యావేత్త వాకాటి విజయకుమార్‌రెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు, హైటెక్ ఫార్మా అధినేత ఎన్‌వీ రమణారెడ్డి, శ్రేయ రియల్‌ఎస్టేట్ ఎం.డీ బాబు అగస్టిన్, సీనియర్ న్యాయవాది వేలూరు రంగారావు తదితరులు పాల్గొని కళాకారులను సన్మానించారు. హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపకుడు..ప్రముఖ హాస్యనటుడు దోర్నాల హరిబాబు, ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఎన్నికలు

ఎట్టకేలకు జిల్లాలో కార్పొరేషన్, పురపాలక సంఘాల ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చెప్పుకోదగిన అవాంఛనీయ సంఘటనలు కూడా ఏమీ లేవు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా.అజిత వేజెండ్ల పెద్ద ఎత్తున ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగాయి. నెల్లూరు నగరపాలక సంస్థ, ఆత్మకూరు, బుచ్చి మునిసిపాలిటీల్లో ఎన్నికల పోలింగ్‌కు భారీ ఏర్పాట్లుచేసి, ఎక్కడా ఓటర్లకు ఇబ్బంది లేకుండా జిల్లా అధికార యంత్రాంగం సకల చర్యలు చేపట్టింది. జిల్లా ఎన్నికల పరిశీలకులు, జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ తదితర అధికారులంతా అమ్రత్తంగా ఉంటూ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టంగా నిర్వహించారు. భారీ పోలీసు బందోబస్తు ఉండడంతో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అటు పోలింగ్, ఆ తర్వాత కౌంటింగ్ కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగిపోయాయి. రాజకీయంగా కూడా గొడవలు అల్లర్లు లేకుండా రాజకీయనాయకులు, కార్యకర్తలు ఎంతో సంయమనంతో సహకరించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులతో పాటు ఇతర పార్టీల వారు కూడా వారి నాయకులకు, కార్యకర్తలకు తగు సూచనలు ఇచ్చి ఉండడంతో ఎక్కడా ఇబ్బందులు జరగలేదు. సుప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సంరక్షణ అవసరం

ప్రతి నీటిబొట్టు విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని డీఎంఅండ్‌హెచ్ఓ డా.సుజాత చెప్పారు. ఈనెల 3న నెల్లూరులోని తమ కార్యాలయంలో ఏర్పాటుచేసిన బ్రిక్స్ జీవనశైలి వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా జిల్లాలో నీటిని ఎలా సంరక్షించుకోవాలో వివరించారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి



ప్రఖ్యాత గాయని, భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతిని పలువురు సంగీత కళాకారిణులు ఈనెల 1న నెల్లూరు టౌన్‌హాలులో వేడుకగా నిర్వహించారు. ప్రముఖ గాయని బాలార్క ఆధ్వర్యంలో, ఆమె శిష్యబృందం సుబ్బలక్ష్మికి తమ సంగీత కచేరీతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆలపించిన పలు కీర్తనలు, గీతాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.

టీడీపీ విజయదరహాసం

• మంత్రి నారాయణ కార్యాలయంలో సంబరాలు



ఆనందోత్సాహంతో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నారాయణ కుటుంబసభ్యులు

నెల్లూరు కార్పొరేషన్‌లో తెలుగుదేశం అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో నెల్లూరులోని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకుంటూ, పార్టీ జెండాలు చేతపట్టి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు. కార్పొరేటర్లుగా గెలిచినవారంతా వచ్చి తమ నేతలను కలసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అదేవిధంగా, నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయం విజయోత్సాహంతో, కార్యకర్తల ఆనందోత్సవాలతో నిండిపోయింది. బాణసంచా కాల్చి విజయోత్సవాలు చేసుకున్నారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డిలు శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వెళ్ళి ఆయనని కలసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

జయభేరి మోగించిన..జనసేన

జిల్లాలో జనసేన పార్టీ విజయధ్వంకా మోగించింది. మునిసిపల్ ఎన్నికల్లో తొలిసారి పోటీచేసినా, తమకెదురే లేదని అనిపించింది. కూటమి పార్టీలో ఒకటైన జనసేన పార్టీకి, పొత్తులో భాగంగా నెల్లూరు, నెల్లూరు రూరల్‌లో పలు స్థానాలను కేటాయించారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 6,15, 21, 71 డివిజన్లను, నెల్లూరు రూరల్ పరిధిలోని 29, 30, 45, 53 డివిజన్లను జనసేన అభ్యర్థులకు ఇచ్చారు. పోటీచేసిన ఈ అన్ని స్థానాల్లోనూ జనసేన ముందు నిలిచి, విజయాన్ని సాధించడం విశేషం. నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో పాటు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మంత్రి నారాయణ కుటుంబసభ్యులు సైతం ఈ ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయానికి ముమ్మరంగా ప్రచారాలు నిర్వహించారు. ఒక దశలో జనసేనకి ఓట్లేయొద్దని మంత్రి నారాయణ చెప్పినట్లుగా కొంతమంది అసత్యప్రచారాలు చేసినా, జనం నమ్మలేదు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సారధ్యంలో, టిడ్కో చైర్మన్..జనసేన నాయకుడు వేములపాటి అజయ్‌కుమార్ తదితర నాయకులు సలహాసంప్రదింపులతో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసి కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులు జనసేనకి తిరుగులేని విజయం చేకూర్చారు. పోటీచేసిన అన్నిస్థానాలనూ గెలుచుకుని తమ సత్తా ఏమిటో నిరూపించుకున్నారు. 6వ డివిజన్‌లో జనసేన అభ్యర్థి బత్తల శ్రీకాంత్ విజయబావుటా ఎగురవేశారు. అదేవిధంగా, 15వ డివిజన్‌లో గుర్రం కెజియా కుమారి, 21వ డివిజన్‌లో గునుకుల విజయలక్ష్మి, 29వ డివిజన్‌లో నాగిశెట్టి మురళీకృష్ణ, 30వ డివిజన్‌లో రుషికేష్ యాదవ్, 45వ డివిజన్‌లో సుందరరామిరెడ్డి, 53వ డివిజన్‌లో నవ్య కామాక్షి, 71వ డివిజన్‌లో షేక్ ఆలియా విజయాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో జనసేనలో నూతనోత్సాహం నెలకొంది.

5 స్థానాల్లో వికసించిన కమలం

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అయిదు స్థానాలను గెలుచుకున్నారు. దీంతో నగరంలో బీజేపీ హవా ప్రారంభమైంది. మొత్తం 6డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. కూటమి నేతల అండదండలు, బీజేపీ నాయకుల సారధ్యంలో 5 స్థానాల్లో విజయాన్ని సునాయాసంగా కైవసం చేసుకున్నారు. 7వ డివిజన్‌లో సిరిగిరి లక్ష్మి, 31వ డివిజన్‌లో యరబోలు రాజేష్, 42వ డివిజన్‌లో మండల కామాక్షి, 43వ డివిజన్‌లో మొగరాల శోభ, 60వ డివిజన్‌లో కూరపాటి రఘురామరాజు గెలిచారు.

శ్రీసిటీలో వేడుకగా..

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయం వార్షికోత్సవాలు

సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక హోమాలు



హోమం నిర్వహిస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి దంపతులు

శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల ఆలయ వార్షిక ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణలతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. పరిశ్రమల ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద భక్తులు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కలశపూజ, పుణ్యాహ వచనం, వేదపారాయణం కార్యక్రమాలతో వార్షిక ఉత్సవాలు మొదలయ్యాయి. స్వామివారికి సుప్రభాతంతో ప్రారంభించి గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దంపతులు ఆ పూజలలో పాల్గొన్నారు. సమాజ శ్రేయస్సు, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రకృతి పరిరక్షణను ఆకాంక్షిస్తూ ఈ హోమాలు నిర్వహించినట్లు డా. సన్నారెడ్డి తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, కృతజ్ఞతాభావం, ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందిస్తాయన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకి తీర్థ, అన్నప్రసాదాలు అందచేశారు. మణిప్రతాప్, పిబిఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజీ తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆత్మకూరులో అనుకున్నదే జరిగింది

• సత్తా చాటిన డా.బొమ్మిరెడ్డి షకీలా



ఆత్మకూరు మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని, ప్రముఖ డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా తన సత్తా చాటుకుంది. తొలినుంచి ఆమెది రాజకీయ కుటుంబం కావడం, ఆమె మామ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం సాధించడం ఆ కుటుంబానికి ప్లస్ పాయింట్లుగా మారాయి. రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టుబట్టి ఆమెని ఎన్నికల రంగంలోకి దించి, ఆమె విజయానికి ప్రచారం ముమ్మరం చేయడంతో ప్రజలు వారి మీదున్న గౌరవంతో, టీడీపీ మీదున్న అభిమానంతో డాక్టర్ షకీలాని భారీ మెజారిటీతో గెలిపించారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 26,529 ఓట్లుంటే, అందులో 19,535 ఓట్లు పోలయ్యాయి. 10,581 ఓట్లతో డాక్టర్ షకీలా విజయం సాధించారు.

బుచ్చి..'విజయలక్ష్మి'నే వరించింది

• వేమిరెడ్డి దంపతుల కృషి ఫలించింది



బుచ్చిరెడ్డిపాళెం మునిసిపల్ చైర్‌పర్సన్‌గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మి విజయం సాధించడంతో వేమిరెడ్డి దంపతుల కృషి ఫలించినట్లయింది. బుచ్చి ప్రజలు టీడీపీ అభ్యర్థినికే పట్టం కట్టారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కూటమి నేతలను ఆదరించారు. బుచ్చిలో మొత్తం 36,438 ఓట్లుంటే అందులో పోలైనవి 23,373 కాగా, విజయలక్ష్మి 15,315 ఓట్లు సాధించి విజయాన్ని కైవసం చేసుకున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిలో టీడీపీ జెండా ఎగరేయాలని ఈ స్థానాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో ఎంపీపీగా పనిచేసి, రాజకీయాల్లో మంచి అనుభవం ఉన్న దొడ్ల విజయలక్ష్మిని టీడీపీ అభ్యర్థిగా బరిలో దించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా ప్రచారాల్లో పాల్గొని టీడీపీ అభ్యర్థినిని గెలుపు బాట పట్టించారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ.. టీడీపీయే!

నెల్లూరు నగరపాలకసంస్థ (కార్పొరేషన్), ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించగా, అందులో కూడా టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులు అధికశాతం మంది ప్రభుత్వానికి మద్దతుగా ఓటేయడంతో కూటమి అభ్యర్థుల విజయం నల్లేరుమీద నడకగా సాగింది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 1175 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉంటే అందులో 720 ఓట్లు టీడీపీకే లభించడం విశేషం. ప్రత్యర్థిపార్టీ వైసీపీకి 314 ఓట్లు వచ్చాయి. బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ పరిధిలో 204 పోస్టల్ బ్యాలెట్ ఓట్లుంటే, అత్యధికంగా 182 ఓట్లు టీడీపీకి రావడం విశేషం. వైసీపీకి కేవలం 16 మాత్రమే లభించాయి. అదేవిధంగా ఆత్మకూరు మునిసిపాలిటీలో ఉన్న 163 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 90 టీడీపీకి, 30 వైసీపీకి దక్కాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తీరునుచూస్తే, ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వం పనితీరుపై సంతృప్తికరంగా ఉన్నట్లు తేటతెల్లమవుతుంది.

పరిషత్తు పోరులో.. 30 స్థానాలకు ఎన్నికలు

జిల్లాలోని మొత్తం 35 జడ్పీస్థానాలలో 5 స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 30 స్థానాలకి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ స్థానాల్లో మొత్తం 103 మంది అభ్యర్థులు ఎన్నికల రంగంలో ఉన్నారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం 440 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 78 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 875 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికలకి సంబంధించి జడ్పీ సీఇఓ ఈనెల 3న విలేకర్లతో మాట్లాడుతూ, పరిషత్తు ఎన్నికలను ఈనెల 5న (గురువారం) నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 12,85,848 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు భావిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు ఈనెల 7న జరగనుందని, కౌంటింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశామని చెప్పారు.



విద్యార్థుల్లో నాయకత్వం : బాధ్యతను నేర్పే మార్గదర్శక శక్తి!

'నా'యకత్వం' అనే మాట వినగానే చాలామందికి రాజకీయనాయకులు, పెద్ద సంస్థల అధిపతులు, లేదా చరిత్రను మార్చిన మహనీయులు గుర్తుకు వస్తారు. కానీ నాయకత్వం అనేది పదవి కాదు, వయస్సు కాదు, అధికారమూ కాదు. నాయకత్వం అనేది ఒక మనస్తత్వం. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం, ఇతరులను ప్రోత్సహించడం, బాధ్యతను స్వీకరించడం, ఒక లక్ష్యం కోసం నిబద్ధతతో పనిచేయడం నాయకత్వం యొక్క అసలు లక్షణాలు. అందుకే నాయకత్వాన్ని పెద్దవారికి మాత్రమే పరిమితం చేయకూడదు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందితే, అవి జీవితాంతం ఆ వ్యక్తిని విజయపథంలో నడిపిస్తాయి. నాయకత్వం అనేది ముందుండి ఆదేశాలు ఇవ్వడం కాదు; ముందుండి ఆచరించడం. ఒక తరగతి గదిలో ఉపాధ్యాయుడు లేని సమయంలో క్రమశిక్షణను పాటించమని చెప్పే విద్యార్థి నాయకుడు కావచ్చు. ఒక బృందంలో అందరూ వెనక్కి తగ్గినప్పుడు బాధ్యత తీసుకుని పనిని పూర్తిచేసే విద్యార్థి నాయకుడు కావచ్చు. ఒక సమస్యను చూసి విమర్శించకుండా పరిష్కారం కోసం ఆలోచించే వ్యక్తి నాయకుడు కావచ్చు. "నాయకుడు దారిని వెతకడు, దారిని సృష్టిస్తాడు" అనే మాట నాయకత్వ సారాన్ని అద్భుతంగా వివరిస్తుంది.

విద్యార్థి జీవితంలో నాయకత్వం యొక్క తొలి పాఠం బాధ్యత. బాధ్యత తీసుకోని వ్యక్తి నాయకత్వాన్ని నిలబెట్టలేడు. తరగతి ప్రతినిధిగా ఉండటం, ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం, క్రీడా బృందాన్ని నడిపించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అవకాశాలు విద్యార్థులకు బాధ్యతను నేర్పుతాయి. చిన్న బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం ద్వారా పెద్ద బాధ్యతలకు సిద్ధమవుతారు. నాయకత్వం ఒకరోజులో ఏర్పడదు; చిన్న చిన్న బాధ్యతలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా అది క్రమంగా రూపుదిద్దుకుంటుంది.నాయకత్వంలో రెండవ ముఖ్యమైన లక్షణం వినగలగడం. చాలామంది నాయకత్వం అంటే మాట్లాడటం అనుకుంటారు. కానీ గొప్ప నాయకులు ముందుగా వినడం నేర్చుకుంటారు. ఒక విద్యార్థి తన స్నేహితుల అభిప్రాయాలను వినగలిగితే, వారి భావాలను అర్థం చేసుకోగలిగితే, అతను మెరుగైన నిర్ణయాలు తీసుకోగలడు. వినడం ద్వారా సహనం పెరుగుతుంది. సహనం ద్వారా అవగాహన పెరుగుతుంది. అవగాహన ద్వారా నాయకత్వం బలపడుతుంది. "మాట్లాడితే తెలిసింది చెబుతాం; వింటే తెలియనిది నేర్చుకుంటాం" అనే మాట ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలి.

నాయకత్వం అనేది ఆత్మవిశ్వాసంతో ముడిపడి ఉంటుంది. అయితే ఆత్మ విశ్వాసం అంటే అహంకారం కాదు. "నేను చేయగలను" అనే నమ్మకం ఆత్మవిశ్వాసం. "నేనే చేయగలను" అనే భావన అహం కారం. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకున్నవారే నిజమైన నాయకులు అవుతారు. ఒక విద్యార్థి తన సామర్థ్యాన్ని



నమ్మాలి, కానీ ఇతరుల ప్రతిభను కూడా గౌరవించాలి. బృందంలోని ప్రతి వ్యక్తి విలువను గుర్తించే వ్యక్తే ప్రభావవంతమైన నాయకుడు. విద్యార్థుల్లో నాయకత్వాన్ని పెంపొందించడానికి పాఠ్యపుస్తకాలు మాత్రమే సరిపోవు. పాఠశాలల్లో జరిగే సభలు, వాదోపవాద పోటీలు, సేవా కార్యక్రమాలు, విజ్ఞాన ప్రదర్శనలు, క్రీడా పోటీలు.. ఇవన్నీ నాయకత్వాన్ని పెంచే ప్రయోగశాలలే. వేదికపై మాట్లాడే అవకాశం పొందిన విద్యార్థి సంభాషణా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటాడు. బృంద ప్రాజెక్టును నిర్వహించిన విద్యార్థి ప్రణాళికా నైపుణ్యాలను నేర్చుకుంటాడు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థి మానవీయ విలువలను అర్థంచేసుకుంటాడు. నాయకత్వం అంటే విజయవంతమైన సందర్భాల్లో మాత్రమే ముందుండడం కాదు. కష్టకాలంలో ధైర్యంగా నిలబడడం కూడా. ఒక ప్రాజెక్టు విఫలమైతే, బాధ్యతను ఇతరులపై నెట్టివేయడం సులభం. కానీ తప్పులను అంగీకరించి, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని, మళ్లీ ప్రయత్నించడానికి బృందాన్ని ప్రోత్సహించే వ్యక్తి నిజమైన నాయకుడు. "విజయంలో అనేక మంది భాగస్వాములు ఉంటారు; అపజయంలో బాధ్యత స్వీకరించేవాడే నాయకుడు" అనే మాట యువతకు గొప్ప మార్గదర్శకం.

నాయకత్వం అనేది కేవలం వ్యక్తిగత విజయానికి సంబంధించినది కాదు. అది సమాజానికి ఉపయోగపడే వ్యక్తులను తయారుచేయడం కూడా. ఒక విద్యార్థి తన సహచరులకు సహాయం చేసినప్పుడు, వెనుకబడి ఉన్న వారిని ప్రోత్సహించినప్పుడు, పాఠశాలలో మంచి విలువలను వ్యాప్తి చేసినప్పుడు, అతను నాయకత్వాన్ని ఆచరిస్తున్నట్లే. సమాజాన్ని మెరుగుపరచాలనే ఆలోచన నాయకత్వానికి పునాది. ఈ రోజుల్లో సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ప్రపంచవ్యాప్త అనుసంధానం వేగంగా మారుతున్న ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయి. ఇలాంటి ప్రపంచంలో భవిష్యత్తు నాయకులకు కేవలం జ్ఞానం సరిపోదు. వారిలో నిర్ణయ సామర్థ్యం, భావజ్ఞానం, సంభాషణా నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే దృష్టి, ఇతరులతో కలిసి పనిచేసే సామర్థ్యం కూడా ఉండాలి. భవిష్యత్తులో విజయవంతమయ్యే విద్యార్థులు ఎక్కువ సమాచారం ఉన్నవారు కాకపోవచ్చు. ఆ సమాచారాన్ని సద్వినియోగం చేయగలిగినవారే అవుతారు. విద్యార్థులు నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రతిరోజూ చిన్న చిన్న అలవాట్లు పెంచుకోవాలి. ఒక సమస్య కనిపించినప్పుడు "ఇది ఎవరో పరిష్కరిస్తారు" అనకుండా "దీనికి నేను ఏమి చేయగలను?" అని ఆలోచించాలి. ఒక పని అప్పగించిన ప్పుడు కనీస స్థాయిలో కాదు, అత్యుత్తమంగా పూర్తిచేయడానికి ప్రయత్నించాలి. ఒక బృందంలో ఉన్నప్పుడు ప్రశంసలను పంచుకోవాలి, బాధ్యతలను స్వీకరించాలి. ఈ చిన్న చర్యలే భవిష్యత్తులో గొప్ప నాయకత్వానికి పునాదులు అవుతాయి. ప్రపంచాన్ని మార్చిన ప్రతి నాయకుడు ఒకప్పుడు విద్యార్థే. వారు సాధారణ వ్యక్తుల్లాగే తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. వారిని ప్రత్యేకంగా నిలబెట్టింది వారి ఆలోచనా విధానం, బాధ్యత పట్ల నిబద్ధత, మరియు ఇతరుల కోసం పనిచేయాలనే తపన. విద్యార్థి దశలో పెంపొందించిన నాయకత్వ లక్షణాలు జీవితాంతం ఆ వ్యక్తికి దిక్సూచిలా ఉంటాయి.



వచ్చే వారం : విద్యార్థి సంఘాలు : నాయకత్వాన్ని పెంచే సృజనాత్మక వేదికలు

E-mail: reddyu@gmail.com

నగరవాసులకి.. ఓటుపై మరీ.. ఇంత అలక్ష్యమా?

- ఓట్లేసినవారు కేవలం 57.72 శాతమే!

నెల్లూరు నగరవాసులు ఓటు హక్కు వినియోగించుకోవడంపై నిరాసక్తత ప్రదర్శించారు. అందువల్ల పోలింగ్‌శాతం ఆశించినస్థాయిలో పెరగలేదు. నగరంలో మునిసిపల్ ఎన్నికల పోలింగ్ భారీగా ఉంటుందని అందరూ అనుకున్నా, నగర పౌరులు మాత్రం అనేకమంది నిమ్మకు నీరెత్తినట్లే కనిపించారు. నెల్లూరులో 72 డివిజన్లు ఏర్పాటైన సంగతి అందరికీ తెలిసిందే. అందులో మొత్తం ఓటర్ల సంఖ్య 4,89,351 మంది. కానీ, ఓటేసింది మాత్రం 2,86,466 మందే. సుమారు సగం మందే ఓటేశారు. మిగిలినవారు దుమ్మా కొట్టారు. 11 డివిజన్లలో కేవలం 49శాతం మంది (సగానికి తక్కువే) ఓటేశారు. 46వ డివిజన్‌లోనైతే మరీ తక్కువ మంది ఓట్లేశారు. ఈ డివిజన్‌లో మొత్తం 5060 ఓట్లుంటే, 1864 మంది మాత్రమే ఓట్లు వేయడం (36.83 శాతం) గమనార్హం. ఇప్పుడే కాదు, గతంలో కూడా జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఓట్ల శాతం గొప్పగా ఏమీ లేదు. 2014లో 5707 శాతం, 2021లో 52.25 శాతం మందే ఓట్లేశారు. ఇప్పుడు అత్యల్పంగా 57.72 శాతానికి పెరగడం పెద్ద గొప్పేమీ కాదు. దాదాపు రెండు లక్షల మందికి పైగానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. కారణాలేమైనా.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడమన్నది ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమని అందరికీ తెలిసినా, నగర ఓటర్లు అనేకమంది అసలు పోలింగ్ కేంద్రాలవైపు కన్నెత్తి చూడకపోవడం దారుణం. ఓట్ల స్లిప్పులు తమకు అందలేదనో, లేదా మరొక సాకునో చూపి మొత్త మ్మీద ఓటు వేయకుండా ఎగనామం పెట్టారు. నగరంలో ఎంతోమంది చదువుకున్నవారు, విద్యావేత్తలకు, ప్రముఖులకి, పెద్దపెద్ద వ్యాపారాలు చేసుకునేవారికి కొదవలేదు. ఓటు వేయాలని ఒకరు చెప్పాల్సిన పనిలేదు. కానీ, ఎందుకో ఆ నిరాసక్తత ఎవరికీ అర్థంకాదు. పోలింగ్ రోజైన ఆదివారం రోజున వాతావరణం కూడా బాగానే ఉంది. పోలింగ్ కేంద్రాలు కూడా అందుబాటులో ఏర్పాటుచేశారు. జిల్లా అధికార యం త్రాంగం మొత్తం ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అహర్నిశలు కష్టపడింది. ఓటు హక్కును వినియోగించుకోవాలని గత కొద్దిరోజులుగా అధికారులు పదేపదే చెప్తున్నా, పెద్దసంఖ్యలో ఓటర్లు మాత్రం ఓటు వేయకుండా నిమ్మళంగా ఉండిపోయారంటే ఏమనుకోవాలో వారికే తెలియాలి. 'మన ఓటు-మన హక్కు' అని తెలిసినా అంత అలక్ష్యమైతే ఎలా?..అన్నీ తెలిసిన విజ్ఞులకి ఇంతకంటే ఏం చెప్పగలం? ఈ ఎన్నికల్లో 51, 46 డివిజన్లలో అతితక్కువ ఓట్లు పడ్డాయి. 3, 4, 5, 23, 55 డివిజన్లు ఓట్లు వేయడంలో కాస్తంత ముందు నిలవడం విశేషమే మరి!..

డివిజన్ల వారీగా పోలింగ్ శాతం చూడండి!

1వ డివిజన్‌లో 68.87శాతం, 2లో 64.99, 3లో 71.43, 4లో 73.88, 5లో 73.11, 6లో 66.67, 7లో 63.61, 8లో 63.38, 9లో 59.99, 10లో 63.00, 11లో 59.60, 12లో 55.98, 13లో 60.53, 14లో 60.50, 15లో 57.58, 16లో 59.04, 17లో 59.03, 18లో 59.99, 19లో 53.42, 20లో 52.26, 21లో 51.87, 22లో 51.12, 23లో 75.30, 24లో 62.85, 25లో 42.71, 26లో 50.93, 27లో 44.36, 28లో 53.11, 29లో 49.40, 30లో 48.78, 31లో 49.57, 32లో 56.36, 33లో 60.19, 34లో 67.79, 35లో 64.51, 36లో 41.74, 37లో 54.42, 38లో 49.50, 39లో 54.37, 40లో 58.48, 41లో 57.48, 42లో 53.35, 43లో 47.64, 44లో 44.35, 45లో 40.93, 46లో 36.84, 47లో 42.44, 48లో 54.87, 49లో 52.36, 50లో 50.24, 51లో 39.27, 52లో 45.37, 53లో 45.48, 54లో 65.15, 55లో 70.53, 56లో 53.21, 57లో 59.72, 58లో 62.96, 59లో 61.43, 60లో 46.99, 61లో 60.26, 62లో 64.74, 63లో 66.38, 64లో 63.83, 65లో 63.16, 66లో 66.78, 67లో 58.56, 68లో 65.66, 69లో 62.69, 70లో 65.08, 71లో 66.91, 72లో 66.41% మంది ఓట్లేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

చెల్లని ఓట్లు..భారీగానే ఉన్నాయి

జిల్లాలో జరిగిన స్థానిక ఎన్నికల పోరులో 'నోటా'తో పాటు చెల్లని ఓట్లు కూడా ఎక్కువుగానే ఉన్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌లో నోటాకు అన్ని వార్డుల్లోనూ కనీసం 30కి తగ్గకుండా పడ్డాయి. ఆమేరకు 40 డివిజన్లలో సుమారు 1056 ఓట్లు నోటాకి వచ్చి ఉంటాయని అంచనా. అదేవిధంగా, బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీలో నోటాకి 43ఓట్లతో పాటు, ఓటు సరిగా వేయక చెల్లని ఓట్లు 225 వరకు నమోదయ్యాయని తెలుస్తోంది. ఆత్మకూరు మునిసిపాలిటీలో కూడా నోటాకి 60 ఓట్లు పడితే, మరో 514 ఓట్లు వివిధ కారణాలతో చెల్లకుండా పోయాయని సమాచారం.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి కొత్త డైరెక్టర్‌గా..ఆచార్య రెడ్డి శ్యామల



మాడభూషి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామల

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, వెంకటాచలం మండలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి నూతన డైరెక్టర్‌గా ఆచార్య యద్దనపూడి రెడ్డి శ్యామల నియమితులయ్యారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఆమె ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. భారతీయ భాషా సంస్థ సంచాల కులు ఆచార్య బసవరాజ కొడగుంటి, ప్రాచీన భాషల సమన్వయకర్త డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్ వెబ్ ద్వారా పాత-కొత్త డైరెక్టర్లకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా, ఆ కేంద్రంలో ఇప్పటివరకు డైరెక్టర్‌గా పని చేసిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌ను సన్మానించి వీడ్కోలు సభ నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా సంపత్‌కుమార్ సిబ్బందికి సూచించారు. నూతన డైరెక్టర్ శ్యామల మాట్లాడుతూ, ఆచార్య సంపత్‌కుమార్ అలుపెరగని సాహితీవేత్త అని, ఆయన అపార భాషా సేవకులని, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగు భాషకు ఒక చిరునామా వంటిదని అన్నారు. మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థ అన్ని భాషలను ఆదరిస్తోందని, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటు ఎన్నో పోరాటాల ఫలితమని, అందరి సహకారంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని తెలిపారు. అనంతరం పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ ఆ కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు గంగిశెట్టి శివకుమార్, చిన్ని నారాయణరావు, గోవిందరాజు సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, తలారి మాలకొండయ్య, లెక్చరర్లు పద్మప్రియ, దివ్య, నెరసం అధ్యక్షులు జయప్రకాష్, ఉపాధ్యాయుడు ఎల్ మురళి, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుజా షామిలి, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది పాల్గొన్నారు.

• ఇస్రో.. మరో విజయం

జీఎస్ఎల్వీ-ఎఫ్18.. సక్సెస్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. జీఎస్ఎల్వీ ఎఫ్ 18 రాకెట్‌ని విజయవంతంగా రోదసిలోకి ప్రవేశపెట్టి, నేవిగేషన్ రంగంలో మరో ముందడుగు వేసింది. శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండో అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి అక్టోబర్ 30వ తేదీ రాత్రి సరిగ్గా 11.51 గంటలకు రాకెట్ నిప్పులు చిమ్ము కుంటూ నింగిలోకి దూసుకుపోయింది. జీఎస్ఎల్వీ (జియో సింక్రనస్ లాంచ్ వెహికల్) ఎఫ్18 రాకెట్ తనతో మోసుకెళ్ళిన ఎన్‌విఎస్-03 నేవిగేషన్ ఉప గ్రహాన్ని నిర్దేశిత భూ స్థిర కక్ష్యలోకి జయప్రదంగా చేర్చడంతో శాస్త్రవేత్తల్లోను, రాకెట్ గమనాన్ని టీవీల్లో వీక్షిస్తున్న ప్రజల్లోనూ హర్షాతిరేకాలు వెల్ల డయ్యాయి. దాదాపు 50 మీటర్ల పొడవు, 420 టన్నుల బరువున్న జీఎస్ఎల్ఈ రాకెట్ 2250 కిలోల బరువున్న ఎస్‌విఎస్-03 ఉపగ్రహాన్ని దిగ్విజయంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇస్రో ప్రతిభా పాటవాలకి నిదర్శనం. ఈ ఉపగ్రహంలో అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు అణుగడియారాలను కూడా ఏర్పాటుచేశారు దీంతో నేవిగేషన్ సామర్థ్యం మరింతగా పెరిగి, నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతో పాటు, సరి హద్దుల వెలుపల సుమారు 1500 కిలోమీటర్ల పరిధిలోని సమాచారం కూడా అందనుందని భావి స్తున్నారు. విమానయానం, సముద్ర ప్రయాణం, రవాణా, వాహనాల పర్యవేక్షణ వంటి అత్యవసర సేవలు పటిష్టంగా నిర్వహించేందుకు ఇవి ఉపక రిస్తాయి కూడా. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో భారత వేవిగేషన్ వ్యవస్థకి మరింత బలం చేకూరుతుందని భావించవచ్చు. ప్రయోగా నంతరం ఇస్రో ఛైర్మన్ డా. వి.నారాయణన్ మాట్లాడుతూ, ఇది ఇస్రో సమిష్టి కృపి అన్నారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు



జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా ఎన్‌విఎస్-03 ఉ పగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినందుకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్, షార్ డైరెక్టర్ ఎస్.ముత్తుచెలియన్, ఇతర షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. కేవలం 56 రోజుల వ్యవధిలోనే వరుసగా రెండు జీఎస్ఎల్వీ ప్రయోగాలను చేపట్టి ఇస్రో అరుదైన రికార్డు సృష్టించిందని ఆయన కొనియాడారు.

మానవ విలువలే..సమాజ ప్రగతికి పునాది

ఎన్‌బీకేఆర్‌లో ఉత్సాహంగా 'అన్వయ-2026'



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అటానమస్), విద్యానగర్‌లోని యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ సెల్ ఆధ్వర్యంలో ఇటీవల మెకానికల్ సెమినార్ హాల్‌లో 'అన్వయ-2026' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో మానవీయ విలువలు, నైతిక ఆలోచనలు, సామరస్యపూర్వక జీవన విధానాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాజుల్ ఆస్తానా జీ, ఎన్‌సీయుహెచ్‌వీ, ఏఐసీటీఇ వైస్‌ఛైర్మన్ మరియు ఇంటర్నేషనల్ రిసోర్స్ సెంటర్ ఫర్ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అండ్ ఎథిక్స్ మాజీ డైరెక్టర్, డా.శర్మిలా ఆస్తానా జీ (ఏఐసీటీవీ యుహెచ్‌వి రిసోర్స్ పర్సన్) పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు, యుహెచ్‌వీ పొటెన్షియల్ నోడల్ సెంటర్ జనరల్ సెక్రటరీ బి.రాఘవమ్మ, జాయింట్ సెక్రటరీ కె.నరేంద్ర, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సమాజం పట్ల సరైన అవగాహన, మానవ సంబంధాల్లో నమ్మకం, కుటుంబం మరియు సమాజంలో సామరస్యం, వృత్తిపరమైన జీవితంలో నైతిక విలువలు వంటి అంశాలపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైపోథటికల్ సిట్యుయేషన్ అనాలిసిస్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, కథా రచన, ఇతిహాసాలపై క్విజ్, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలు నిర్వహించగా, దాదాపు 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, మానవీయ విలువలు, సామరస్యపూర్వక సమాజ నిర్మాణం పట్ల కళాశాల నిబద్ధతను ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

గూడూరు డివిజన్

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈ నెల 1వతేదీ నెల్లూరు డిస్ట్రిక్ట్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టాలెంట్ స్కేటింగ్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ రోహిణి, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, డిఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ, క్రీడల్లో రాణించడంతో పాటు చిన్నారుల శారీరక దృఢత్వానికి సరైన పౌష్టికాహారం(డైట్) ఎంతో ముఖ్యమని సూచించారు. కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, స్కేటింగ్ చిన్నారుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, నిరంతర సాధనతో జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అండర్-4 నుండి అండర్-14 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు టీటీడీ మేనేజర్ శ్యామ్ చేతులమీదుగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందజేశారు. ఇక్కడ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శ్రీహరికోట జిల్లా కోచ్ ప్రభాస్ ప్రత్యేకంగా అభినందించారు.

స్టేట్‌మీట్‌కి శ్రీ గాయత్రి విద్యార్థులు



విద్యార్థులని అభినందిస్తున్న కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి

పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలలో 200 మీటర్లు, 400 మీటర్లు అండర్ 12 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంతో గోల్డ్ మెడల్స్ సాధించి స్టేట్‌మీట్‌కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల నందు విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 4వ తరగతికి చెందిన రిషిత్‌రెడ్డి, 7వ తరగతికి చెందిన సుష్మారెడ్డి స్కేటింగ్ స్టేట్‌మీట్‌కి ఎంపిక అవ్వడం చాలా గర్వకారణంగా ఉందని, రాష్ట్రస్థాయిలో కూడా ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.



ప్రయాణీకులకి ఆహారాన్నందజేస్తున్న మయూరి శ్యాంయాదవ్

ప్రయాణికులకు అండగా మయూరి శ్యామ్

'మురుసు' తుఫాను ప్రభావంతో గూడూరు రైల్వేస్టేషన్లో పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి పరిస్థితిని గమనించిన అధికారులు వెంటనే సహాయ చర్యలు చేపట్టారు. స్టేషన్ మాస్టర్ పి.వేంకటేశ్వరరావు, గూడూరు తహసిల్దార్ ప్రసాద్‌ల సూచనతో శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు మరియు సౌత్ సెంట్రల్ రైల్వే డీ.ఆర్.యు.సీ.సీ మాజీసభ్యులు బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్) తన సొంత ఖర్చులతో సుమారు 400మంది ప్రయాణికులకు పులిహోర, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఏఎస్ఐ స్వామి, టిటి మనోజ్, రైల్వే, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. నెల్‌కాస్ట్ యాజమాన్యం, కోట సునీల్ తదితరులు తమ చేయూతనందించారు.



ఆహారాన్నందజేస్తున్న కోట సునీల్‌కుమార్

ఎం.వి.రావు ఫౌండేషన్ బాలల దినోత్సవం



కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ముప్పవరపు వెంకటేశ్వరరావు పేరిట ఏర్పాటైన ఎం.వి.రావు ఫౌండేషన్ నేతృత్వంలో ఈ నెల 15న విద్యానగర్ గ్రామంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలలో క్రీడలలోనూ, విద్యలోనూ, కళా రంగంలోనూ, ఏ రంగంలో వారైనా పాల్గొనదలచిన ఐదు సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయసు గల విద్యార్థినీ విద్యార్థులు వెంటనే వారి పేర్లను 9493834124 వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేయాలని, పూర్తి వివరాలకి 9440096224 నెంబరుని సంప్రదించాలని ఫౌండేషన్ నిర్వాహకులు కోరుతున్నారు.

శ్రీ కృష్ణ గోశాలలో గిత్తదూడకి బారసాల



గోశాలలో పూజలు చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ నందకిషోర్

గూడూరులోని శ్రీకృష్ణ గోశాలలో ఇటీవల గిత్తదూడకి బారసాల మహోత్సవం ఘనంగా జరిగింది. గోశాల అధ్యక్షుడు రత్న ఆచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు సబ్‌రిజిస్ట్రార్ నందకిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గిత్తదూడకి నంది అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోసంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, ఈ వేడుకలో భాగస్వామిని కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రత్న ఆచారి కుటుంబసభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ధర్మశాస్త ఆయ్యప్పస్వామి దేవస్థాన
ద్వితీయ వార్షికోత్సవం 8న



కమిటీ సభ్యులతో ఆలయ ఛైర్మన్ సురేష్‌కుమార్‌రెడ్డి

గూడూరు, కాశి లేఔట్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 8న దేవస్థానంలో జరగనున్న కార్యక్రమాలపై ఆలయ కమిటీ ఛైర్మన్ కేశారపు సురేష్‌కుమార్‌రెడ్డి కమిటీ సభ్యులతో ఈ నెల 1న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అనంతరం కేరళ వాయిద్యలు, తెనాలి బ్యాండుతో గ్రామోత్సవం, పుష్పయాగం వైభవంగా జరుగుతాయని, ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పెనుబోలు సునీల్‌కుమార్‌రెడ్డి, పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కలగట్ల శివయ్య, వినయ్‌కుమార్‌స్వామి, నందవరం సుబ్బారావు, సురేంద్ర, గిరి, ఆలయ ప్రధాన అర్చకులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డి దంపతులను కలసిన..బుచ్చి విజేతలు

బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు ఈనెల 3న నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దొడ్ల విజయలక్ష్మి, 26వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన నిడిగుంట శ్రావణి ఈ సందర్భంగా వారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ విజయానికి మద్దతుగా నిలిచి అన్ని విధాలా సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

కార్పొరేషన్‌లో అత్యధిక, అత్యల్ప మెజార్టీలు!

నెల్లూరు నగర కార్పొరేటర్లుగా గెలిచినవారిలో ఎక్కువ మంది దాదాపు వెయ్యి ఓట్లకు పైగానే మెజార్టీ సాధించారు. అత్యధికంగా 2వేల మెజార్టీ సాధించినవారు కూడా ఉన్నారు. 10వ డివిజన్‌లో కోటేశ్వరి 2900 మెజార్టీతో గెలవగా, 17వ డివిజన్‌లో కాకర్ల తిరుమలనాయుడు 2840 ఓట్ల మెజారిటీ సాధించారు. వీరితో పాటు నిమ్మల ప్రసన్నకుమారి, కువ్వారపు బాలాజీ, పొట్లూరి రామకృష్ణ, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, కొండా గీతిక, కుడుముల చిరంజీవి, అన్నంగి సమతలు కూడా 2వేలకి పైగానే మెజార్టీతో విజయం సాధించారు. మొత్తమ్మీద 72 డివిజన్లున్న నెల్లూరు నగర కార్పొరేషన్‌లో 69 డివిజన్లను కూటమి కైవసం చేసుకోగా, 2డివిజన్లలో ఇండిపెండెంట్లు గెలిచారు. మిగిలిన ఒక్క డివిజన్(13వ డివిజన్)లో నెలవాయి కామాక్షి అత్యల్పంగా 83 ఓట్ల మెజారిటీతో గెలిచి, వైసీపీకి కార్పొరేషన్‌లో చోటు కల్పించింది.

'మాతృశ్రీ బ్రాహ్మణ భవనం'లో అభివృద్ధి పనులు



పుష్పగిరి మహా సంస్థాన పీఠాధిపతులు జగద్గురువు శ్రీ అభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ పుష్పగిరి నృసింహ భారతిస్వామివారి బ్రాహ్మణ భవన సముదాయంలో శ్రీ మాతృశ్రీ బ్రాహ్మణ భవనం మొదటి అంతస్తు నిర్మాణ ప్రారంభ పూజ కార్యక్రమం గురువారం నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌లో ఉన్న పుత్త ఎస్టేట్స్‌లో జరిగింది. నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిట్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, ఏపీ బ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీవీఎస్ కళ్యాణ సదన్ మేనేజింగ్ ట్రస్టీ దేశబోట్ల ఫణి రత్నం, పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొని పూజలు హోమాలు చేశారు.

విద్యాసంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్‌జీ



భారతీయ విద్యార్థులు జ్ఞానాన్ని అనుసరించే వారిగానే కాకుండా జ్ఞానాన్ని అభివృద్ధి చేసేవారుగా ఎదగాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్‌జీ ఆకాంక్షించారు. ఈనెల 5న నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు సారధ్యంలో నిర్వహించిన విశ్వవిద్యాలయ అధ్యాపకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలంటే దేశంలో ఉన్నటువంటి విద్యాసంస్థలు అన్నింటిలో కూడా అధ్యాపక, అధ్యాపకేతర ఖాళీలు అన్నింటిని కూడా పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని, తరగతి గదులను ఆధునీకరించాలని, విద్యాసంస్థలలో మౌలిక వసతులు మెరుగుపరచాలని, ప్రయోగశాలలు నేటి పరిస్థితులకు అనుకూలంగా తీర్చిదిద్దాలని ఆయన వివరించారు. అనంతరం, లక్ష్మణ్‌జీని ఉప కులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు సన్మానించారు. ఏబీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ చెంచురెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరారెడ్డి, ప్రొఫెసర్ విజయ, ప్రొఫెసర్ త్రివేణి, ప్రొఫెసర్ హనుమారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులకు కొరత లేదు

జిల్లాలో నిత్యావసర వస్తువులు కొరత తీవ్రంగా ఉందంటూ వచ్చే వదంతులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సిలిండర్లతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యం, చక్కెర తదితర నిత్యావసర వస్తువుల నిల్వలన్నీ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఈనెల 2న ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వదంతులను నమ్మి ముందస్తుగా అధిక మొత్తంలో నిత్యావసరాల కొనుగోళ్లు చేయవద్దని సూచించారు. నవంబర్ 2 నాటికి జిల్లాలోని 267 పెట్రోల్ బంకుల్లో 1,710 కిలోలీటర్ల పెట్రోల్, 2,832 కిలోలీటర్ల డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, 57ఎల్పీజీ అవుట్‌లెట్లలో 21,385 సిలిండర్లు నిల్వ ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా 1,470 చౌకధరల దుకాణాల పరిధిలో 10,832.215 మెట్రిక్ టన్నుల బియ్యం, 374.727 మెట్రిక్ టన్నుల చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

5వ డివిజన్‌లోనూ.. టీడీపీకే గెలుపు

నెల్లూరు రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం వహించే ఆనం కుటుంబీకుడు, వైసీపీ మేయర్ అభ్యర్థి ఆనం విజయ కుమార్‌రెడ్డి సొంత డివిజన్‌గా భావించే 5వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో కూడా వైసీపీ గెలవలేకపోయింది. ఆ స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఇంగిలాల అబ్రహం విజయం సాధించారు. ప్రత్యర్థిగా పోటీచేసిన వైసీపీ అభ్యర్థి జాషువా ఓటమి పాలయ్యారు. ఈ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి అబ్రహాం 398 ఓట్లతో విజయం సాధించడం విశేషం.

నవ వధువు.. 'ఓటు' ఉత్సాహం!



ఓటేయాలన్న తపనతో.. ఓ నవ వధువు పెళ్ళిమండపం నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చేసింది. పెళ్ళి దుస్తులతోనే ఆమె పోలింగ్ కేంద్రానికి రావడంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. నవంబరు 1 ఆదివారం రోజున, వివాహం అయిన వెంటనే ఆమె వచ్చి నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకోవడం చూసి అందరూ అవాక్కయ్యారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను, ఓటు వేయాలనే బాధ్యతను చాటుతూ నెల్లూరు రూరల్ పరిధిలో ఉన్న నవలాకులతోట నాలుగోమైలు హైస్కూలులో ఉన్న పోలింగ్ కేంద్రానికి ఎంతో ఉత్సాహంతో వచ్చిన నిహారిక అనే నవ వధువును స్థానికులు అభినందించారు. ఓటు వేయాలనే ఆమె ఉత్సాహాన్ని అధికారులు సైతం ప్రశంసించారు.

అభివృద్ధికి జైకొట్టిన ప్రజలు

మంత్రి నారాయణ కుమార్తె షరణి



నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 62వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసిన పొట్లూరి రామకృష్ణ 2153 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించగా, ఎన్నికల సమయంలో స్వయంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి నారాయణ కుమార్తె షరణి, గెలిచిన తర్వాత కూడా ఈనెల 4న జరిగిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీని గెలిపించినందుకు డివిజన్ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కోటమిట్ట మహాలక్ష్మమ్మ గుడి వద్ద నుండి ప్రారంభమైన ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆమెకు డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. భారీగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం షరణి విలేకర్లతోమాట్లాడుతూ, నెల్లూరు నగరంలో తమ తండ్రి..మంత్రి నారాయణ గత రెండున్నరేళ్లలో రూ.5వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరడం వల్లే ప్రజలు టిడిపిని భారీ మెజారిటీతో గెలిపించారని, భవిష్యత్తులోనూ ప్రజలందరికీ మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

అవయవ మార్పిడి చికిత్సల్లో.. అపోలోకి విశిష్ట గుర్తింపు



అపోలో వైద్య బృందం

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ అవయవ మార్పిడి వైద్య సేవల్లో ఇటీవల మరో ముఖ్యమైన ఘనతను నమోదు చేసింది. గత అక్టోబర్ నెలలో 6 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, 2 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఏ.కె.చక్రవర్తి, ఆసుపత్రి యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి, నెఫ్రాలజిస్టులు డాక్టర్ మస్తాన్ వలీ, డాక్టర్ రాకేష్‌లు మాట్లాడుతూ, ఈ సందర్భంగా ప్రాంతీయ వైద్యరంగంలో మూడు కీలక మైలురాళ్లు నమోదయ్యాయని తెలిపారు. నెల్లూరులో తొలిసారిగా మరణించిన దాత నుంచి కాలేయ మార్పిడి జరగడం వాటిలో ప్రధానమైనదని తెలిపారు. మరణించిన దాత నుంచి సేకరించిన కాలేయాన్ని గ్రహీతకు విజయవంతంగా అమర్చడం ద్వారా నెల్లూరు ప్రాంతంలో ఈ తరహా ఆధునిక వైద్య సేవలకు నాంది పలికినట్లయిందన్నారు. అదేవిధంగా, రాయలసీమ ప్రాంతంలో ఒకే రోగికి తొలిసారిగా కాలేయం మరియు కిడ్నీ మార్పిడి చేయడం జరిగిందని, ఒకే రోగికి కాలేయం, కిడ్నీ రెండింటినీ మార్పిడి చేసే అత్యంత సంక్లిష్టమైన వైద్య ప్రక్రియను నిర్వహించడం ద్వారా బహుళ అవయవ మార్పిడి చికిత్సలో అపోలో ఆసుపత్రి మరో కీలక ముందడుగు వేసిందని వారు తెలిపారు. స్థానిక ప్రజలకు సంక్లిష్టమైన ఇలాంటి అవయవ మార్పిడి చికిత్సలు అందుబాటులో ఉండేలా అపోలో హాస్పిటల్స్ నెల్లూరు తన వైద్య సేవలను కొనసాగిస్తోందని వారు వివరించారు. ఈ సమావేశంలో అపోలో హాస్పిటల్స్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ వైద్యులు యం.శ్రీనివాస్, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ హిమబిందు, యూరాలజిస్ట్ డాక్టర్ రంగనాథన్, అనస్తీషియా నిపుణులు డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, క్రిటికల్ కేర్ విభాగం డాక్టర్ కోటి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుని చొరవతో.. నీటి సరఫరా

గత వారం రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో అవస్తలు పడుతున్న గ్రామస్తులకు ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేయించి అభినందనలు అందుకున్నాడో టీడీపీ నాయకుడు. రాపూరు పంచాయతీలోని నవాబుపేట పరిధిలో మోటార్లు చెడిపోయి, మంచినీరు సరఫరా కావడం లేదని తెలుసుకున్న ఆ గ్రామ టీడీపీ నాయకుడు శ్రీకిరెడ్డి శశిధర్‌రెడ్డి వెంటనే సొంత డబ్బులు వెచ్చించి అక్కడున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయించారు. అంతేకాదు, పంచాయతీ అధికారులతో మాట్లాడి తన సొంత ఖర్చులతో ఆయన గ్రామంలోని మంచినీటి మోటార్లను మరమ్మతు చేయించారు కూడా. దీంతో స్థానిక ప్రజలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఉదయగిరి చెక్క నగిషీ ఉత్పత్తుల కేంద్రాన్ని..

మరింతగా అభివృద్ధి చేస్తాం



- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఉదయగిరి చెక్క నగిషీ ఉత్పత్తులకు రాష్ట్రస్థాయిలోనే కాక దేశస్థాయిలో కూడా మంచి గుర్తింపు ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తెలిపారు. ఇటీవల ఆయన స్థానిక నాయకులతో కలసి కామన్ ఫెసిలిటీ సర్వీస్ సెంటర్‌ని సందర్శించారు. ఈ కేంద్రం అభివృద్ధి కోసం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమన్వయంతో జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లతో చర్చించి 50 లక్షల నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఉదయగిరి ఇంత అందమైన ఉత్పత్తులకు కేంద్రంగా ఉండడం సంతోషాన్ని కలిగిస్తోందని రవిచంద్ర తెలిపారు. సుమారు 300 మందికి పైగా పేద మైనారిటీ మహిళలకు ఈ కేంద్రం ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని, నూతన భవనాలను నిర్మించి అందుబాటులోకి తెస్తే ఉపాధి అవకాశాలు మరింతగా పెంచవచ్చని, భవిష్యత్తులో వెయ్యిమంది మైనార్టీ మహిళలకు ఉపాధి లభించేలా దీనిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పుల్లనీళ్లపల్లిలో.. పోలేరమ్మ జాతర



చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లి గ్రామంలో గతనెల 30 నుంచి నవంబరు 1వ తేదీ వరకు మూడురోజుల పాటు శ్రీ పోలేరమ్మ–పోతురాజు గ్రామ దేవతల జాతర అత్యంత వైభవంగా జరిగింది. గ్రామప్రజలు సుఖ శాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ఈ జాతర నిర్వహించారు. మాగంటి ప్రసాద్ మరియు పద్మజ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భాగంగా తొలుత, ఆలయ అర్చకులు మొదటి రోజు పెన్నానది నుండి పవిత్రజలాలను తెచ్చి కలశపూజ చేశారు. రెండవరోజు కళ్యాణం, మూడవరోజు అంబలి సమర్పించి గౌరి పూజ నిర్వహించారు. అనంతరం గ్రామప్రజలకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక ప్రముఖులు..మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, వారి కుటుంబసభ్యులు కొమ్మి ప్రమీలా దేవి, కొమ్మి సిద్ధులునాయుడులతో పాటు, మాగంటి అంకయ్యనాయుడు, డొంకల నరసింహారావు, డొంకల మురళి ప్రసాద్, పెద్దసంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రూప్‌కుమార్ మేయరయ్యాడు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 72 డివిజన్లలో టీడీపీ 54, జనసేన 8, బీజేపీ 5 స్థానాలు గెలుచుకుని కూటమికి 69 స్థానాలతో తిరుగులేని విజయాన్ని అందించాయి. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు కూడా ప్రజలు అవకాశం కల్పించారు. ఒకప్పుడు నగర రాజకీయాల్లో బలమైన శక్తిగా ఉన్న వైఎస్సార్‌సీపీని కేవలం ఒక్క స్థానానికే పరిమితం చేశారు. ఈ ఫలితాలు కేవలం ఒక పార్టీ విజయంగానే కాకుండా, నాయకుల మధ్య సమన్వయం, కూటమి ఐక్యత, ప్రజల తీర్పు ఎంత బలంగా పనిచేయగలవో చాటిచెప్పాయి.

సీటు సాధించి.. గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్న వేమిరెడ్డి!

2024 ఎన్నికల సమయంలో వేమిరెడ్డి దంపతులతో పాటు రూప్‌కుమార్‌యాదవ్ కూడా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రూప్‌కుమార్ పార్టీలో చేరినరోజే భవిష్యత్తులో నెల్లూరు నగర మేయర్‌గా నిన్ను చూడాలన్న తన ఆకాంక్షను వేమిరెడ్డి వ్యక్తం చేశారు. ఆ రోజు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం ఆయన చేసిన ప్రయత్నాలు ఈ ఎన్నికల్లో కీలక ఘట్టంగా మారాయి. 2024 తర్వాత తెలుగుదేశం పార్టీలో రూప్‌కుమార్ ప్రాధాన్యత పెరిగింది. రాజకీయంగా తనకున్న పరిచయాలు, ఇతర నాయకులతో ఉన్న సంబంధాలను కొనసాగిస్తూనే, వేమిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఆయన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. అయితే 2026 ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పదవి మూడు దశాబ్దాల తర్వాత ఓసీ జనరల్‌కు కేటాయించబడటం రాజకీయంగా కొత్త చర్చకు దారితీసింది. వైఎస్సార్‌సీపీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆనం విజయకుమార్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతో, తెలుగుదేశం కూడా అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపవచ్చన్న అంచనాలు వినిపించాయి. కానీ వేమిరెడ్డి ఆలోచన భిన్నంగా ఉంది. కూటమి అభ్యర్థిగా రూప్‌కుమార్ యాదవ్‌కే అవకాశం కల్పించాలని ఆయన పట్టు బట్టారు. మంత్రి నారాయణ కూడా ఆ ప్రతిపాదనకు బలంగా మద్దతు పలికారు. ఓసీ జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థిని నిలబెట్టడం రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమని, దానివల్ల ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడవచ్చని కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సందేహాలను పార్టీ అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా వేమిరెడ్డి వెనక్కి తగ్గలేదు. మంత్రి నారాయణతో కలిసి పార్టీ పెద్దలను ఒప్పించారు. రూప్‌కుమార్ గెలుపుతో పాటు మొత్తం 72 డివిజన్లలో కూటమి అభ్యర్థులను విజయపథంలో నడిపించే బాధ్యతను తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. చివరకు రూప్‌కుమార్‌కు మేయర్ అభ్యర్థిగా అవకాశం దక్కింది. అయితే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించడంతోనే వేమిరెడ్డి తన బాధ్యత ముగిసిందని భావించలేదు. ఎన్నికల ప్రచారంలో ఎక్కడా వెనుకడుగు వేయలేదు. ఎవరు పిలిచినా ప్రచారానికి వెళ్లారు. రూప్‌కుమార్‌తో పాటు కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నిరంతరం పనిచేశారు. ముఖ్యంగా రూప్‌కుమార్‌పై ఆయన ఉంచిన రాజకీయ విశ్వాసం, నగర ప్రజలపై పెట్టుకున్న నమ్మకం చివరకు నిజమయ్యాయి. పార్టీలో చేరిన రోజున ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాకుండా, తన అభ్యర్థిని భారీ మెజారిటీతో మేయర్ పీఠంపై కూర్చోబెట్టడంలో వేమిరెడ్డి విజయం సాధించారు.

నారాయణ అభివృద్ధిపై పెట్టుకున్న నమ్మకం వమ్ము కాలేదు!

నెల్లూరు రాజకీయాల్లో పొంగూరు నారాయణకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అభివృద్ధి అనే అంశాన్ని రాజకీయాలకు ప్రధాన అజెండాగా మార్చుకుని నగర రూపురేఖలను మార్చాలన్న లక్ష్యంతో ఆయన పని చేస్తున్నారు. నగర శాసనసభ్యుడిగా, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా నగరంతో పాటు రూరల్ ప్రాంత అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా నెల్లూరులో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. సగంలో నిలిచిపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను తిరిగి ప్రారంభించడం, పాత ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక హంగులు కల్పించడం, నిర్లక్ష్యానికి గురైన పార్కులను సుందరమైన ఉద్యానవనాలుగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలు నగర అభివృద్ధికి కొత్త ఊపునిచ్చాయి. ముఖ్యంగా వీఆర్ హైస్కూల్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలు ఆయన అభివృద్ధి దృక్పథానికి నిదర్శనంగా నిలిచాయి. ఇలా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు రాబోయే పురపాలక ఎన్నికల్లో కూటమికి సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయని నారాయణ బలంగా విశ్వసించారు. మేయర్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా, ప్రజలు కూటమి అభ్యర్థికి మద్దతు ఇచ్చి తనపై ఉన్న విశ్వాసాన్ని చాటుకుంటారని ఆయన భావించారు. రూప్‌కుమార్ అభ్యర్థిత్వం ఖరారు కావడంలో కూడా నారాయణ కీలక పాత్ర పోషించారు. వేమిరెడ్డి ప్రతిపాదనకు మద్దతుగా నిలవడమే కాకుండా, పార్టీ అధిష్టానాన్ని ఒప్పించడంలో తన వంతు కృషి చేశారు. అభ్యర్థి ఎంపికతో తన బాధ్యత ముగిసిందని ఆయన భావించలేదు. రూప్‌కుమార్‌తో పాటు ప్రతి డివిజన్‌లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. తన కుటుంబ సభ్యులను కూడా ప్రచారంలో భాగస్వాములను చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఫలితాలు వెలువడిన తర్వాత నారాయణ పెట్టుకున్న నమ్మకం ఎంత బలమైనదో స్పష్టమైంది. 72 డివిజన్లలో 69 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం, రూప్‌కుమార్ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఆయన అభివృద్ధి అజెండాకు ప్రజల నుంచి లభించిన రాజకీయ మద్దతుగా భావించవచ్చు.

స్నేహధర్మం పాటించిన శ్రీధర్‌రెడ్డి!

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం పాత్రను తక్కువగా అంచనా వేయలేం. మొత్తం 72 డివిజన్లలో నగర పరిధిలో 36, రూరల్ పరిధిలో మరో 36 డివిజన్లు ఉన్నాయి. అంటే మేయర్ ఎన్నికలో రూరల్ నియోజకవర్గం ఓటర్ల తీర్పు కూడా నగరంతో సమానమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాత్ర అత్యంత కీలకంగా మారింది. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో ఆయనకు ఉన్న పరిచయాలు, ప్రజలతో ఉన్న సంబంధాలు, గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నికల సమయంలో ఆయనకు బలంగా మారాయి. మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో శ్రీధర్‌రెడ్డి అభిప్రాయానికి పార్టీ అధిష్టానం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. ఆయనను ఒప్పించేందుకు స్వయంగా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర వెళ్లడం ఆయనకు పార్టీలో ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తుంది. అంతేకాకుండా, శ్రీధర్‌రెడ్డి కోరుకుంటే ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి కూడా అవకాశం కల్పించేందుకు పార్టీ సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. అయితే ఇక్కడే శ్రీధర్‌రెడ్డి తన రాజకీయ పరిణతిని, వ్యక్తిగత విలువలను చాటుకున్నారు. తన సోదరుడికి అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనను పక్కనపెట్టి, పార్టీ నిర్ణయానికి కట్టుబడ్డారు. అదే సమయంలో తన చిరకాల మిత్రుడు రూప్‌కుమార్ యాదవ్ అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వ్యక్తిగత ప్రయోజనం కంటే పార్టీ ప్రయోజనానికి, స్నేహానికి ప్రాధాన్యతనిచ్చారు. రూప్‌కుమార్ అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత ఆయన విజయమే లక్ష్యంగా శ్రీధర్‌రెడ్డి శక్తివంచన లేకుండా పనిచేశారు. తన సోదరుడు గిరిధర్‌రెడ్డితో పాటు తన ఇద్దరు కుమార్తెలు హైందవి, వైష్ణవిలను కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేశారు. రూరల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో రూప్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నగర ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుంచి వచ్చిన మద్దతు కూటమి విజయానికి గణనీయమైన బలాన్ని చేకూర్చింది. తన మిత్రుడిని మేయర్‌గా చూడాలన్న శ్రీధర్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరింది. రాజకీయాల్లో వ్యక్తిగత అనుబంధాలు, స్నేహానికి విలువనిస్తూనే పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయవచ్చని ఆయన ఈ ఎన్నికల ద్వారా నిరూపించారు.

నాయకుల ఐక్యతే విజయానికి అసలైన బలం!

ఈ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కూటమి విజయం ఒక్క నాయకుడి కృషితో సాధ్యమైనది కాదు. వేమిరెడ్డి రాజకీయ పట్టుదల, నారాయణ అభివృద్ధిపై ఉన్న నమ్మకం, శ్రీధర్‌రెడ్డి వ్యక్తిగత శ్రమ.. ఈ మూడు శక్తులు ఒకే లక్ష్యంతో పనిచేయడం వల్లే ఇంతటి ఘన విజయం సాధ్యమైంది. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు, పార్టీ శ్రేణుల సమన్వయం నుంచి ప్రతి డివిజన్‌లో గెలుపు వ్యూహాల అమలు వరకు నాయకుల మధ్య కనిపించిన ఐక్యత ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించింది. ఒకరిపై మరొకరికి ఉన్న విశ్వాసం, సమష్టిగా పనిచేయాలన్న సంకల్పం కూటమికి రాజకీయంగా తిరుగులేని బలాన్ని ఇచ్చాయి. ఒకప్పుడు నెల్లూరు నగర రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయించిన వైఎస్సార్‌సీపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం గమనార్హం. ఇది కూటమి సాధించిన విజయ విస్తృతిని తెలియజేస్తోంది. అదే సమయంలో ప్రజలు అభివృద్ధి, నాయకత్వం, రాజకీయ సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తమ తీర్పును వెల్లడించారనే విశ్లేషణకు కూడా ఈ ఫలితాలు ఆస్కారం కల్పిస్తున్నాయి. నాయకులంతా వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఒకే లక్ష్యంతో ముందుకు సాగితే రాజకీయాల్లో అసాధ్యమనుకున్న విజయాలను కూడా సాధించవచ్చని నెల్లూరు పురపోరు మరోసారి నిరూపించింది.

రూప్‌కుమార్‌యాదవ్ ముందు ఇప్పుడు అసలైన పరీక్ష!

80,170 ఓట్ల భారీ మెజారిటీతో మేయర్‌గా ఎన్నికైన రూప్‌కుమార్ యాదవ్‌పై ఇప్పుడు మరింత పెద్ద బాధ్యత పడింది. ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన నాయకుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, తనను ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల సమయంలో నాయకులు చేసిన వాగ్దానాలు, ప్రజలు పెట్టుకున్న ఆశలు కార్యరూపం దాల్చాలంటే నగరపాలక సంస్థ పాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం అవసరం. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పార్కులు, ప్రజారోగ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.రాజకీయాలకు అతీతంగా 72 డివిజన్లను సమాన దృష్టితో చూడాలి. కూటమికి ఓటు వేసినవారితో పాటు ఓటు వేయని ప్రజలకూ సమానంగా సేవలందించాలి. నగర అభివృద్ధిలో ప్రతి డివిజన్‌కు భాగస్వామ్యం కల్పించాలి. ముఖ్యంగా వేమిరెడ్డి తనపై ఉంచిన విశ్వాసాన్ని, నారాయణ తనకు కల్పించిన రాజకీయ మద్దతును, శ్రీధర్‌రెడ్డి తన కోసం చేసిన శ్రమను ప్రజలకు అందించే సేవ ద్వారా సార్థకం చేయాలి. ఎన్నికల్లో సాధించిన భారీ మెజారిటీ ఒక రాజకీయ విజయానికి కొలమానం కావచ్చు. కానీ మేయర్‌గా ఆయన సాధించే అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, నగరానికి తీసుకొచ్చే మార్పులే ఆయన నాయకత్వానికి నిజమైన కొలమానం. నెల్లూరు నగర ప్రజలు ఇచ్చిన ఈ అపూర్వ విజయాన్ని అభివృద్ధి రూపంలో వారికి తిరిగి అందించగలిగినప్పుడే ఈ ఎన్నికల విజయానికి సంపూర్ణ సార్థకత చేకూరుతుంది.

విపిఆర్ విశ్వాసం ఫలించింది.. నారాయణ నమ్మకం నిజమైంది.. శ్రీధర్‌రెడ్డి శ్రమ సత్ఫలితాన్నిచ్చింది. ఇప్పుడు రూప్‌కుమార్‌యాదవ్ వంతు. నెల్లూరును అభివృద్ధి పథంలో ముందుకు నడిపించి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బృహత్తర బాధ్యత ఆయన భుజాలపై ఉంది!

భయపెడుతున్న తుఫాన్‌లు

పలు జిల్లాల్లో వరద కష్టాలు



- ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లు, నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- 'అర్నబ్'తో 4,563కోట్లు, 'మురసు'తో 353కోట్ల నష్టం
- ఎల్‌నినో ప్రభావంతో ఒక కంట కరువు..మరోకంట వరద!

మురసు తుఫాను రాష్ట్రంలోని పలు జిల్లాలను ఇంకా వణికిస్తూనే ఉంది. తీరం దాటిపోయి, కొంత బలహీనపడ్డా వర్షాల తీవ్రత మాత్రం తగ్గనే లేదు. ఈనెల 4-5 తేదీలలో బుధ, గురువారాల్లో కూడా అనేకజిల్లాల్లో భారీ వానలు కురిశాయి. ఈదురు గాలులతో, ఉరుములు మెరుపులతో, కుండపోత వానలతో మురసు భీభత్సాన్ని సృష్టిస్తూనే ఉంది. బుధవారం ఒక్కరోజునే పల్నాడుజిల్లాలో 25.98 సెంటీమీర్ల వర్షపాతం నమోదైందంటే వానలు ఎంత భారీగా కురుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లి రోడ్లమీదకి ప్రవహిస్తున్నాయి. వరదతో పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. వేలాది విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయి. పంటపొలాలు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు కష్టాల్లో చిక్కుకున్నాయి. ఈదురుగాలుల ధాటికి పండ్లతోటలు, ఆకుతోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుఫాన్ ధాటికి గుంటూరులో ఇద్దరు మరణించినట్లు తెలుస్తోంది. తుఫాన్ నష్టాలు భారీగా ఉండడంతో, రాష్ట్రాన్ని ఆదుకోవాలంటూ ప్రభుత్వం కేంద్రానికి నష్టాల నివేదికలను పంపించింది.





మురసు తుఫాన్ బలహీనపడినా, దాని ప్రభావం ఇంకా వదల్లేదు. గురువారం (ఈనెల 5న) రోజున 16 జిల్లాల్లో వర్షాలు కుండపోతగా కురిశాయి. ప్రకాశం, బాపట్ల, ఏలూరు, గుంటూరు, కాకినాడ, పల్నాడు, డా. అంబేద్కర్ కోనసీమ, ఉభయగోదావరి జిల్లాలతో పాటు, సముద్ర తీరప్రాంతమైన నెల్లూరుజిల్లాలోనూ వర్షాల జోరుపెరిగింది. పంటపొలాల్లోకి నీళ్ళు చేరడంతో అవి చెరువుల్లా కనిపించాయి. చేతికి అందివస్తాయనుకున్న పంటలు మునిగిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మరోవైపు కరువు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఒక కంట కరువు..మరోకంట వరద అన్నట్లు వర్షాలు లేక కర్నూలు, నంద్యాల, అనంతపురం వంటి జిల్లాల్లో కరువు పరిస్థితులు దాపురిస్తే, వరుస తుఫాన్లతో మరికొన్ని జిల్లాలు అల్లాడిపోతున్నాయి. రాష్ట్రంలోని 412 మండలాలను ఇప్పటికే కరువు మండలాలుగా ప్రకటించి ఉన్నారు. ఇదిలా వుంటే, నవంబరు 12 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, అది తుఫాన్‌గా మారే ప్రమాదం ఉందని వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో దీనిపై స్పష్టత రావ చ్చునని అంటున్నారు.

వేల కోట్ల ఆస్తినష్టం


మురసు తుఫాను దెబ్బకు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో మొత్తంగా 50వేల హెక్టార్లకి పైగానే పంటలకి నష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రాథమికంగా 353 కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. దీనికి ముందు అర్నబ్ తుఫాన్ వల్ల 4563 కోట్ల వరకు నష్టం జరిగిందని అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి విన్నవించి ఉన్నారు. అర్నబ్ తుఫాన్‌తో 7981 కిలో మీటర్ల రోడ్లు, మురసు తుఫాన్ వల్ల 162 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని, అత్యధికంగా నెల్లూరుజిల్లాలో 66.6 కిలో మీటర్ల రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు కేంద్రానికి తెలిపారు.

నెల్లూరులోనూ వాన..


మురసు తుఫాన్ ప్రభావంతో నెల్లూరు జిల్లాలో కూడా బుధవారం రాత్రి నుంచి వాన జల్లులు జల్లులుగా పడుతూనే ఉంది. గురువారం ఉదయం 9-10 గంటల మధ్య నెల్లూరు నగరంలో వాన దంచికొట్టింది. రోడ్లు కాలువలయ్యాయి. ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, దర్గామిట్ట, చిన్నబజారు, పెద్దబజారు, మాగుంట లేఅవుట్ వంటి జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాలు జలమయమయ్యాయి. అండర్‌బ్రిడ్జిల వద్ద కొంతసేపు నీళ్లు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందిపడ్డారు.

విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఆత్మకూరు

8.91 కోట్లతో బైపాస్‌రోడ్డు



రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆత్మకూరు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇటీవలే సుందరమైన బైపాస్ రహదారి నిర్మాణం జరగడంతో ఆత్మకూరు ప్రాంతం సరికొత్త శోభను సంతరించుకుంది. రూ.8.91 కోట్లతో బైపాస్‌రోడ్డును అభివృద్ధి చేయడం తెలిసిందే! రాత్రివేళ కనువిందు చేసేలా విద్యుత్ దీపాలను అమర్చారు. ఈ బైపాస్‌రోడ్డుకు వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేశారు. రహదారి మధ్యలో పచ్చని మొక్కలతో రోడ్డును చక్కగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనదారులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పట్టణ సుందరీకరణకు ఈ రహదారి ఎంతగానో దోహదపడుతోంది. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో వాయుపుత్ర మార్గ్ ఒక ముఖ్యమైన ప్రాజెక్టుగా నిలుస్తోంది.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com